## విద్యార్థులకి అందించే ఆహారంలో మెనూ తప్పక పాటించాలి

**- ఫుడ్ కమిషన్ సభ్యులు ఇండేల లక్ష్మీరెడ్డి**

**చీమకుర్తి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**



విద్యార్థులకు నిత్యం అందించే ఆహారం విషయంలో, మెను విధిగా పాటించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఇండేల లక్ష్మీరెడ్డి ఆదేశించారు. చీమకుర్తి లో ప్రాథమిక ఉన్నత పాఠశాల, గిరిజన గురుకుల బాలుర విద్యాలయాలను ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మొదట ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకి స్వయంగా వడ్డించారు. ఆయన కూడా రుచి చూసి బాగుందని కితాబిచ్చారు. అక్కడ స్టాక్ రూమ్ ను పరిశీలించారు. పాఠశాల విద్యార్థులను రోజు ఫుడ్ మెనూ ప్రకారమే పెడుతున్నారా లేక మేము వస్తున్నామని ఇలా చేసారా అని ఆరా తీశారు. విద్యార్థుల రోజు ఇలానే ఉంటుంది సార్ అని చెప్పడం, ఫుడ్ రుచిగా , నాణ్యంగా ఉండటం వల్ల ఆయన సంతృప్తి వ్యక్తం వ్యక్తం చేశారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకి అందించే ఆహారం లో మెనూ సరిగా పాటించకాపోవడం, పప్పు పలచగా ఉండటం, కూరగాయలతో కూడిన కూర చెయ్యక పోవటం తో ఆయన వంట సిబ్బందిని మందలించారు. మెనూ పాటించకపోతే చర్య లు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీడీ సోషల్ వెల్ఫేర్ లక్ష్మా నాయక్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి వరలక్ష్మి, డి.ఎస్.వో.పద్మశ్రీ, డి.ఎం సివిల్ సప్లైస్ అధికారి వరలక్ష్మి, సమగ్ర శిక్షా జిల్లా బాలిక సంరక్షణ అధికారి హేమలత తదితర అధికారులు పాల్గొన్నారు.

**ఎర్రగుడిపాడులో...** ఎర్రగుడిపాడు గ్రామంలో రెండు అంగన్వాడీ కేంద్రాల్లో తనిఖీ చేశారు. ఎస్.టి కాలనీ లోని అంగన్వాడీ కేంద్రం అసలు ఓపెన్ చెయ్యలేదని, ఎస్ .సి కాలనీలోని కేంద్రాల్లో పిల్లలు లేరు, పిల్లలకి, బాలింతలకు ఇచ్చే ఆహారం ఆహారం ఒక్కటి కూడా లేదని ఈ విషయం పై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులని ఆయన ఆదేశించారు.

## ఫీల్డ్ అసిస్టెంట్ పై వేటు ఏపీఓకు సోకాజ్ నోటీసు

**ఉలవపాడు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**




ఉలవపాడు తాసిల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఉపాధి హామీ పీ డీ గంగాభవాని అధ్యక్షతన ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాగంగా 2024 2025 సంవత్సరంలో జరిగిన పనులలో తప్పులను గుర్తించారు.1,50,000 రికవరీ తోపాటు విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన రామాయపట్నం ఫీల్డ్ అసిస్టెంట్ను సస్పెండుకు ఆదేశించారు.అతనికి సహకరిస్తూ ఉన్నతాధికారులకు కనీస సమాచారం ఇవ్వని టెక్నికల్ అసిస్టెంట్ మరియు ఏపీవో లకు షోకాజు నోటీసు జారీ చేశారు. ఉలవపాడు లోని 12 మంది జాబ్ కార్డుదారులకు 500 రూపాయల చొప్పున జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, సి ఎల్ అర్ సి బాబురావు, ఏపీ డి శ్రీనివాసులు ఉలవపాడు మరియు గుడ్లూరు ఏపీవోలు అబ్దుల్లా, వెంకటేశ్వర్లు ,ఈసీలు, టి ఏ లు, ఎఫ్ ఎలు ఉపాధి శ్రామికులు పాల్గొన్నారు.

## ఉదయం ఏడు గంటలకే బ్రాందీషాప్ ఓపెన్

**- పట్టీ పట్టనట్టు ఉంటున్న ఎక్సైజ్ అధికారులు**

**కొత్తపట్నం ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**



కొత్తపట్నం మండలం ఈతముక్కల లో బ్రాందీ షాపులు ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం సుమారు 12 గంటల వరకు మందుబాబులకు అందుబాటులో ఉంటున్నాయి. బ్రాందీ షాపులపై ఉన్నత అధికారులు, ఎక్సైజ్ అధికారులు పర్యవేక్షణ పూర్తిగా విఫలం అయిందని అర్థమవుతుంది. రాజకీయ అన్నదండలతో ఎలాంటి నియమ నిబంధనలు పాటించకుండా బ్రాందీ షాప్ యజమానులు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రతి క్వాటర్ బాటిల్ పై అదనంగా పది రూపాయల షాపుల ముందు బోర్డులు పెట్టి మరీఅమ్ముతున్నా ఎక్సైజ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం హాస్యాస్పదంగా ఉంది. బ్రాందీ షాపులపై ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణ బలహీనంగా ఉన్నట్లు తేటతెల్లమవుతుంది. ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు తెలియజేస్తున్నారు.

## యువతలో సామాజిక స్పృహతో పాటు దేశభక్తి చాలా ముఖ్యం: ఇంటూరు నాగేశ్వరరావు

**ఉలవపాడు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**



వందేమాతర గీతం రచించి ఆలపించి 150 సంవత్సరాలు నిండిన సందర్భంగా కేంద్ర హోం శాఖ వారి ఆదేశాలతో జనవరి 28వ తారీఖున ప్రారంభమైన సిఐఎస్ఎఫ్ సైక్లోథాన్ యాత్ర మంగళవారం ఉలవపాడుకు రావడంతో కందుకూరు డిఎస్పి బాలసుబ్రమణ్యం ,సిఐ అన్వర్ భాష ఉలవపాడు ఎస్ఐ సుబ్బారావు పర్యవేక్షణలో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా భారీ జాతీయ పతాకంతో విద్యార్థులు స్వాగతం పలకగా మొదట కస్తూరి తిలకం దిద్ది మంగళహారతులతో గ్రామంలోకి స్వాగాతించి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో కందుకూరు శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులలో సామాజిక బాధ్యతతో పాటు దేశభక్తి కూడా నిండాలని అన్నారు. ఇక్కడికి సైకిల్ యాత్ర పై వచ్చిన వారు మనందరికీ ఆదర్శమని కొనియాడారు .ఈ కార్యక్రమంలో మండల అధికారులు విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇన్విజిలేటర్ల నియామకంలో.. నూతన విధానం

**ఒంగోలు, ప్రభాతవార్త**

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఇన్విజిలేటర్ల నియామకంలో ఈ ఏడాది నుంచి కొత్త విధానం అమలు కానుంది. ఇప్పటి వరకు జిల్లా స్థాయి లోనే ఈ ప్రక్రియ జరగ్గా ఇకపై రాష్ట్ర విద్యాశాఖ అధికారులే నియమించనున్నారు. గతంలో ఇన్విజిలేటర్లుగా నియమించిన కొందరు ఉపాధ్యాయులు ఏవో కారణాలు చెప్పి విధులను రద్దు చేయించుకునే వారు. ఇకపై అలా చేయడానికి కుదరదు. టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టం(సిస్) నమోదు చేసిన వివరాలు ప్రకారం ఈ విధులు కేటాయించనున్నారు. 60 ఏళ్ల నిండిన దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులను మినహాయిస్తారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ పరీక్షలకు గణితం సైన్సు, సోషల్ ఉపాధ్యాయులకు సైన్స్, గణితం,సోషల్ పరీక్షలకు భాషోపాధ్యాయులకు ఇన్విజిలేటర్ల విధులు కేటాయిస్తారు. మార్చి 16 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనుండగా రంజాన్ నేపథ్యంలో తొలుత ప్రకటించిన షెడ్యూల్ను సవరించారు. 20వ తేదీ పండుగ ఉన్న కారణంగా ఇంగ్లీష్ పరీక్ష 21వ తేదీ జరగనుంది. పండుగ రోజు సెలవు ఉంటుందని అధికారులు తెలిపారు.

## సికింద్రాబాద్- కనిగిరి న్యూ డెమో ట్రైన్ను నడపండి

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, నరసరావు పేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవ రాయలు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లాలో నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే లైన్ లో భాగంగా కనిగిరి దాకా రైల్వే పనులు పూర్తి అయినందున సికింద్రాబాద్- కనిగిరి న్యూ డెమో ట్రైన్ను నడపాల్సిందిగా కోరారు. పిడుగురాళ్ల- రామాయపట్నం పోర్టు వయా దర్శి,అద్దంకి, ఒంగోలు నూతన రైల్వే మార్గంను మంజూరు చేయాల్సిందిగా కోరారు. అమృత్ భారత్ స్కీం కింద మంజూరైన రైల్వే స్టేషన్లను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

## పకడ్బందీగా రీ సర్వే పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ జరగాలి

**- జిల్లాల కలెక్టర్లతో సీసీఎల్ఏ జయలక్ష్మి**

**ఒంగోలు, ప్రభాతవార్త**



రీ సర్వే పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని సీసీఎల్ఏ జయలక్ష్మి తెలిపారు. మంగళవారం అమరావతి సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల వారీగా పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో పురోగతిపై సమీక్షించారు. ప్రభుత్వంనిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవాలని, నాణ్యత ప్రమాణాలతో ప్రక్రియ జరగాలని ఆమె స్పష్టం చేశారు. ప్రకాశంభవనం నుంచి కలెక్టర్ పి.రాజాబాబు ఇందులో పాల్గొన్నారు.జిల్లాలో సాధించిన పురోగతిని,లక్ష్యానికి చేరుకునేలా చేపట్టిన చర్యలను ఆయన వివరించారు. మున్సిపల్ కమీషనర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ మంగళవారం ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందుతున్న సేవలు, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, అక్షర ఆంధ్ర కార్యక్రమం, పారిశుధ్యం, హౌసింగ్ తాగునీటి సరఫరా, పంచాయతీ రాజ్, ఉపాధి హామీ చట్టం కింద చేపట్టిన పనుల పురోగతి, పి4 బంగారు కుటుంబాలు, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.

# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక **వార్త**

## జిల్లా సర్వే సంఘం టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ

**ఒంగోలు, ప్రభాతవార్త**



జిల్లా సర్వే సంఘం జిల్లా కమిటీ వారి టేబుల్క్యాలెండర్ను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఆవిష్కరించారు. మంగళవారం ఎమ్మెల్యే జిల్లా సర్వే సంతఘం సభ్యులతో కలిసి 2026 సంవత్సరపు టేబుల్ క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నాళ్ళం వెంకటేశ్వరరావు, స్టేట్ జనరల్ సెక్రెటరీ ఆధ్వర్యంలో జిల్లా ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాసరావు, జిల్లా సెక్రెటరీ వై బాబురావు, జిల్లా ట్రెజరర్ డి. పరిశుద్ధ రావు, సంఘ సభ్యులు ముక్తియార్, మాధవరావు, నాగరాజు, బి శేఖర్ వి ఎస్, హర్షవర్ధన్ తదితరులు హాజరైయ్యారు.

## బీచ్ ఫెస్టివల్ను విజయవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు**

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లాలో ఈ నెల 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న పాకల బీచ్ ఫెస్టివల్ను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా విజయవంతంగా నిర్వహించేలా అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఒంగోలు కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజాబాబు, జిల్లా అధికారులతో సమావేశమై ఈ నెల 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న పాకల బీచ్ ఫెస్టివల్ నిర్వహణలో భాగంగా శాఖల వారీగా చేపట్టవలసిన ఏర్పాట్లపై సమీక్షించి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పాకల బీచ్ ఫెస్టివల్ నిర్వహణపైకు సంబంధించి నోడల్ అధికారిగా జిల్లా పరిషత్ సిఈఓను నియమించడం జరిగిందన్నారు. పాకల బీచ్ ప్రాముఖ్యత జిల్లా ప్రజలతో పాటు ఇతర ప్రాంత ప్రజలకు తెలిసేలా పాకల బీచ్ ఫెస్టివల్ను విజవంతంగా నిర్వహించేలా ఏ శాఖకు కేటాయించిన విధులను ఆ శాఖ అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న పాకల బీచ్ ఫెస్టివల్ కు వచ్చే సందర్శకుల ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. ముఖ్యంగా పారిశుధ్య, మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి వసతి, పార్కింగ్ ఏర్పాట్లు పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బీచ్ ఫెస్టివల్ సందర్భంగా సందర్శకులకు ఆహ్లాదం కలిగించేలా వివిధ రకాల సాహస క్రీడలు, ఎగ్జిబిషన్, హెలికాప్టర్ రైడింగ్, లేజర్ షోతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలను, ఫుడ్ కోర్టులను నిర్వహిస్తున్నందున సంబందిత ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, ఎస్డిసి శ్రీధర్ రెడ్డి, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, డిపిఓ వెంకటేశ్వర రావు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావు, డిఆర్డిఎ పిడి నారాయణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా వెంకటేశ్వర రావు, జిల్లా విద్యా శాఖాధికారి రేణుక, ఐసిడిఎస్ పిడి సువర్ణ, విద్యుత్ శాఖ ఎస్ఈ వెంకటేశ్వర రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### అట్టహాసంగా పాకల బీచ్ రీల్ ఆవిష్కరణ



ఈనెల 14, 15 తేదీలలో సింగరాయకొండ మండలం పాకల బీచ్ లో నిర్వహించే ఫెస్టివల్ నిర్వహణకు సంబంధించిన ప్రమోషన్ రీల్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం రాత్రి నగరంలో అట్టహాసంగా జరిగింది. అద్దంకి బస్టాండు సెంటర్లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మున్సిపల్ కమిషనర్ కె. వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. చరిత్రలో నిలిచిపోయే స్థాయిలో నిర్వహించే ఈ ఉత్సవములో కుటుంబసమేతంగా పాల్గొనాలని జిల్లా ప్రజలకు వారు పిలుపునిచ్చారు. ప్రభుత్వ యంత్రాంగం చేస్తున్న ఏర్పాట్లను ఈ సందర్భంగా వివరించారు.

## జిపిఎస్ వసూళ్లలో ఒంగోలు కార్పొరేషన్ ప్రథమస్థానం సాధించడం అభినందనీయం

**- ఒంగోలు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే దామచర్ల**

**ఒంగోలు కలెక్టరేట్ ప్రభాతవార్త**



జిపిఎస్ వసూళ్లలో ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించడం పట్ల ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు అందుకు కృషి చేసిన కార్పొరేషన్ అధికారులను ఉద్యోగులను అభినందించారు మంగళవారం ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు మరియు టౌన్ ప్లానింగ్ ఎన్టీపీలను ఆయన అభినందించారు కౌన్సిల్ సమావేశానికి నగర మేయర్ గంగాడ సుజాత అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో దామచర్ల మాట్లాడుతూ బి పి ఎస్ వసూల్లోకి తొమ్మిది కోట్లు అదేవిధంగా ఎల్ఆర్ఎస్ కి 4.5 కోట్లు వసూళ్లు సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉన్నామని అన్నారు. బీపీఎస్ కు మార్చి 11 వరకు కాల పరిమితి ఉందన్నారు ఎవరైతే బిపిఎస్ చేసుకోవాలో వారు సకాలంలో కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కోరారు. ఒంగోలు ట్రంకు రోడ్డు విస్తరణ పై జరిగిన చర్చలో విస్తరణను 100 అడుగుల నుంచి అక్కడి వారి విజ్ఞప్తి మేరకు 80 అడుగుల విస్తరణకు సవరించామన్నారు. ఈ నోటీసులు అందజేసిన తర్వాత కొంతమంది సమ్మతించారని మరి కొంతమంది కోర్టుకు వెళ్లారన్నారు కాగా కోర్టు కూడా రహదారిని వంద అడుగులు విస్తరించమని అక్కడ ఉన్న షాప్ యజమానులకు టిడిఆర్బాండ్స్ను మంజూరు చేయమన్నారు. అందరికీ నోటీసులు పంపించిన తర్వాత వారి వద్ద నుండి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు తీసుకొని విస్తరణ పనులను ప్రారంభిస్తామన్నారు. తదుపరి మస్తాన్ దర్గా నుంచి కొత్తపట్నం బస్టాండ్ వరకు 60 అడుగుల రోడ్డు నిర్మాణం కొరకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ రహదారుల విస్తరణ విషయంలో అందరి అభిప్రాయాలు తీసుకుని జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక దృష్టి పెట్టి అందరి ఆమోదయోగ్యంతో రహదారి విస్తరణ కార్యక్రమాలను కొనసాగించడం కు కౌన్సిల్ సభ్యులందరూ కృషి చేయాలని కోరారు. ఒంగోలు నగరంలో మొత్తం 21 పార్కులో ఉన్నాయని అందులో సుజాతనగర్ లో ఉన్న పార్కును కొంతమంది ఆక్రమించారని వారిపై చర్య తీసుకుంటామన్నారు. అన్ని పార్కులను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. రంగారాయుడు చెరువు లోని పార్క్ తో పాటు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును కూడా మరమ్మతులు చేపట్టి ఆధునికరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అందుకు రూ 6.5 కోట్లు వ్యయానికి అంచనాలు వేశామని ఎమ్మెల్యే దామచర్ల అన్నారు. ఈ కౌన్సిల్ సమావేశంలో కమిషనర్ కే వెంకటేశ్వరరావు తో పాటు ఒంగోలు నగరంలోని అన్ని డివిజన్ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## ఎల్విన్ ఎనర్జీకి గ్లోబల్కు.. ప్రతిష్టాత్మక రెండు సోలార్ అవార్డులు !

- *దేశంలో సోలార్ రంగంలో దూసుకుపోతున్న ఎల్విన్ ఎనర్జీ*
- *10 లక్షల ఇళ్లకు సోలార్ విద్యుత్, 20 వేల మందికి ఉద్యోగాలు..*
- *ఎల్విన్ ఎనర్జీ మేనేజింగ్ డైరెక్టర్ విజయ భాస్కర్ వెల్లడి*

**ఒంగోలు, పభాతవార్త**



దేశంలోని సోలార్ పరిశ్రమలో ఎల్విన్ ఎనర్జీ మరో ఘనమైన మైలురాయిని అందుకుంది. వేగంగా ఎదుగుతున్న సోలార్ ఎనర్జీ సంస్థగా పేరొందిన ఎల్విన్ ఎనర్జీకి, ప్రపంచ ప్రఖ్యాత సోలార్ రంగ పత్రికలు ఈక్వీ మ్యాగజైన్ మరియు సోలార్ క్వార్టర్ నుంచి రెండు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ అవార్డులు లభించాయి. నాణ్యత, కస్టమర్ సంతృప్తి, వ్యాపార వృద్ధి అనే మూడు కీలక ప్రమాణాల్లోనూ అసాధారణ ప్రతిభ చూపిన సంస్థగా ఎల్విన్ ఎనర్జీ ఈ డబుల్ గుర్తింపును సొంతం చేసుకుంది. ఒంగోలు, ఫిబ్రవరి 10, దేశంలోని వేగంగా ఎదుగుతున్న సోలార్ ఎనర్జీ సంస్థ ఎల్విన్ ఎనర్జీకి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. సోలార్ రంగానికి చెందిన ప్రముఖ గ్లోబల్ పబ్లికేషన్లు ఈక్వీ మ్యాగజైన్ మరియు సోలార్ క్వార్టర్ సంస్థకు రెండు కీలక అవార్డులను ప్రకటించాయి. ఈ సందర్భంగా ఎల్విన్ ఎనర్జీ మేనేజింగ్ డైరెక్టర్ విజయ భాస్కర్ మాట్లాడుతూ, నాణ్యమైన సోలార్ పరిష్కారాలను అందిస్తూ కస్టమర్ సంతృప్తిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న తమ ప్రయత్నాలకు ఈ అవార్డులు గుర్తింపుగా నిలిచాయని అన్నారు. అంతర్జాతీయ స్థాయి స్వతంత్ర సంస్థల నుంచి వచ్చిన ఈ గౌరవం, భారత సోలార్ రంగంలో ఎల్విన్ ఎనర్జీకి పెరుగుతున్న విశ్వసనీయతను చాటుతోందని పేర్కొన్నారు.కేవలం ఆరు నెలల క్రితమే సోలార్ రూఫ్టాప్ విభాగాన్ని ప్రారంభించిన ఎల్విన్ ఎనర్జీ, ఇప్పటికే 500 మంది ప్రత్యక్ష ఉద్యోగులను నియమించడంతో పాటు, వెయ్యి మందికిపైగా పరోక్ష ఉపాధి అవకాశాలను కల్పించింది. సంస్థ వేగవంతమైన విస్తరణకు ఇది నిదర్శనంగా నిలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ను కేంద్రంగా చేసుకుని స్థిరమైన అభివృద్ధికి దోహదపడేలా సంస్థ భారీ లక్ష్యాలను నిర్దేశించుకుంది. వచ్చే ఐదేళ్లల్లో 10 లక్షల ఇళ్లకు సోలార్ విద్యుత్ అందించడం, 20 వేల మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు, 2 లక్షల మందికి పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించడం, అలాగే రూ.3 వేల కోట్ల పెట్టుబడులు పెట్టడం సంస్థ లక్ష్యాలుగా ప్రకటించింది. అలాగే రూ.3,000 కోట్ల పెట్టుబడులు రాష్ట్రంలో పెట్టడం సంస్థ లక్ష్యాలుగా వెల్లడించింది. గ్లోబల్ గుర్తింపుతో బ్రాండ్ బలోపేతం ప్రపంచవ్యాప్తంగా సోలార్ రంగంపై లోతైన అధ్యయనం చేసే ఈక్వీ మ్యాగజైన్, సోలార్ క్వార్టర్ వంటి పబ్లికేషన్ల అవార్డులు, ఎల్విన్ ఎనర్జీ బ్రాండ్కు అంతర్జాతీయ స్థాయిలో మరింత బలం చేకూర్చినట్లు పరిశ్రమ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ గుర్తింపులు పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచడంతో పాటు, రాబోయే రోజుల్లో సంస్థ విస్తరణకు కీలకంగా మారనున్నాయి.

## కమ్యూనిటీ హాల్ ప్రారంభించిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి

**జె. పంగులూరు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**



గ్రామంలోని అనేక రకాల సమావేశాలకు, పార్టీ సమావేశాలు, పలు రకాల అభివృద్ధి కార్యక్రమాలకు అనుకూలంగా ఉండేలా ఈ కమిటీ హాల్ ఉపయోగపడుతుందని మంత్రి గొట్టిపాటి అన్నారు. మండలంలోని కొండ మంజులూరు గ్రామంలో సి. ఎస్ .ఆర్. నిధులతో 20 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ శిలాఫలకాన్ని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం ప్రారంభించగా మంత్రి గొట్టిపాటి ఆధ్వర్యంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రావు రమేష్ బాబు కమిటీ హామీ ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని గోకుల షెడ్ ను మంత్రి గొట్టిపాటి ఆధ్వర్యంలో గ్రామ నాయకులు తెలుగుదేశం పార్టీ నాయకులు చింత ప్రారంభించారు.



ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో తీసుకురావడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రావు రమేష్ బాబు, మాజీ జడ్పిటిసి సభ్యులు కుక్కపల్లి పద్మ ఏడుకొండలు, తాసిల్దార్ పీ.సింగారావు ఎంపీడీవో కె. స్వరూప రాణి, ఎంపీపీ, తేళ్ల నాగమ్మ , జడ్పిటిసి సభ్యురాలు రాయిని ప్రమీల వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ సందిపోగు సుప్రియ, సర్పంచ్ చొప్పరపు ప్రభాకర్, తెలుగుదేశం పార్టీ మహిళా మండలి అధ్యక్షురాలు గుంటుపల్లి రాణి, కాంట్రాక్టర్ బురెడ్డి ఓబుల్ రెడ్డి, కొండమంజులూరు, కోటపాడు, జే వి పాలెం గ్రామాల సొసైటీ అధ్యక్షులు బత్తుల వెంకటరావు, రావుల సింగర్ కొండ, అల్లం నేని బ్రహ్మానంద స్వామి, ఎస్సై బి వినోద్ బాబు తెలుగుదేశం పార్టీ మరియు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## దేశ రక్షణ, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా సీఐఎస్ఎఫ్ జవాన్లు చేపట్టిన సైకిల్ ర్యాలీ

**ఒంగోలు క్రైమ్, పభాతవార్త**



దేశ శాంతి భద్రతల పరిరక్షణలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) కీలకమైన పాత్ర పోషిస్తున్నదని, సురక్షిత తీరం, తీర ప్రాంతాల పరిరక్షణతో పాటు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో సీఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్ - 2026 పేరిట చేపట్టిన ఈ సైకిల్ యాత్ర, తొమ్మిది రాష్ట్రాల్లో 6,500 కిలోమీటర్ల దూరం ప్రయాణించనుంది. ఈ ర్యాలీని జనవరి 28వ తేదీన కోల్కతా నుంచి ప్రారంభించి, కేరళ రాష్ట్రం కొచ్చి వరకు కొనసాగించి ఫిబ్రవరి 23వ తేదీన ముగించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం సీఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీ ఒంగోలు జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు, ఎన్సీసీ విద్యార్థులు సీఐఎస్ఎఫ్ జవాన్లకు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ సంజీత్ కుమార్ మాట్లాడుతూ 100 మందికి పైగా సైకిలిస్టులతో ఈ సైకిల్ ర్యాలీని నిర్వహిస్తున్నామని తెలిపారు. సముద్ర తీర ప్రాంతాల రక్షణతో పాటు, దేశంలోని యువత మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఎదుర్కొనే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సైకిల్ ర్యాలీని ప్రతిరోజూ సుమారు 150 నుంచి 160 కిలోమీటర్ల మేర కొనసాగిస్తున్నామని, సీఐఎస్ఎఫ్ సిబ్బంది తమ ధైర్య సాహసాలు, క్రమశిక్షణతో ర్యాలీని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారని వివరించారు. తీర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు తీర భద్రత ప్రాధాన్యత, దేశ రక్షణలో వారి పాత్ర, భద్రతా దళాలకు వారు అందించవలసిన సహకారం గురించి ఈ ర్యాలీ ద్వారా వివరించబడుతోందన్నారు. ఇప్పటివరకు 14 రోజులుగా నిరంతరంగా సైకిల్ ర్యాలీ కొనసాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ విక్రమ్ సింగ్, ఎస్బి డిఎస్పి చిరంజీవి, ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఒంగోలు తాలూకా సీఐ విజయకృష్ణ, ఒంగోలు ట్రాఫిక్ సీఐ జగదీష్,ఎస్సైలు, ఆర్ఐలు సీతారామి రెడ్డి, రమణారెడ్డి మరియు సిబ్బంది పాల్గొన్నారు.



6_6.qxd 2/11/2026 12:09 AM Page 1



## మాజీ జడ్పీటీసీ కొండలకు మంత్రి గొట్టిపాటి పరామర్శ



**బల్లికురవ, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
మండలంలోని కొనిదేన గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ తన్నీరు ఏడుకొండలు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సమాచారం అందుకున్న రాష్ట్ర ఇంధన శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం కొనిదేనలోని ఆయన నివాస గృహానికి చేరుకుని కొండలను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ప్రభుత్వపరంగా ఏ సహకారం అందజేయడానికైనా తాను సిద్ధంగా ఉన్నానని భరోసా కల్పించారు.

## నూతన వధూవరులకు మంత్రి గొట్టిపాటి ఆశీర్వాదం



**బల్లికురవ, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
మండలంలోని కే.రాజుపాలెం గ్రామంలో జాస్తి సందీప్ వివాహం ఇటీవల జరిగింది. సమాచారం అందుకున్న రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం రాజుపాలెంలోని వారి ఇంటికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

### వెంకయ్య ఆశ్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు వారి ఆధ్వర్యంలో అన్నదానం



**మార్టూరు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
మార్టూరు వెంకయ్య ఆశ్రమంలో బాపట్ల జిల్లా మార్టూరు వాస్తవ్యులు కి.శే కొర్రపాటి రమాదేవి జయంతి సందర్భంగా భర్త డాక్టర్ కొర్రపాటి లక్ష్మీనారాయణ,కుటుంబ సభ్యులు ఆశ్రమంలో అన్నదానం చేశారు. స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. ఆశ్రమ అధ్యక్షుడు తన్నీరుశివ రాజేష్ దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు అధ్యక్షుడు మాదాల సాంబశివరావు, మాజీ అధ్యక్షులు మద్దుమాల కోటేశ్వరరావు, మాజీ అధ్యక్షులు జాష్టి సాంబశివరావు, రొటేరియన్ డాక్టర్ కొర్రపాటి సుబ్రహ్మణ్యం, ఇతరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర్లు మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సంతాపం



**మార్టూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త**
జొన్నతాళి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గోరంట్ల వెంకటేశ్వర్లు మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి పట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. ఆయన మృతి చాలా బాధాకరం అన్నారు. వెంకటేశ్వర్లు మృతి కుటుంబ సభ్యులకు, తెలుగుదేశం పార్టీకి తీరని లోటని అన్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. గ్రామాభివృద్ధిని కాంక్షించే మంచి వ్యక్తి అని కొనియాడారు. తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుడిని కోల్పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ, అంకిత భావంతో పని చేసే మంచి నాయకుడిని కోల్పోయిందన్నారు. ఆయన కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

## పుష్కర బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి



**లింగసముద్రం, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
లింగసముద్రం మండలం కేంద్రం లింగసముద్రం పంచాయతీ జంగంరెడ్డిపాలెంలో రామాలయం ప్రథమ పుష్కర బ్రహ్మోత్సవాలలో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పండితులు ఎమ్మెల్యేకి వేద మంత్రాలతో స్వాగతం పలుకుతూ ఆలయంలోనికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా గ్రామానికి విచ్చేయగా, వారందరిని ఎమ్మెల్యే నాగేశ్వరరావు పేరుపేరునా ఆత్మీయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో మద్దిశెట్టి వెంకట్రావు, మండల ప్రధాన కార్యదర్శి అడపా రంగయ్య, పున్నపు చెన్నయ్య, కొట్టే ఆచారి, వెంకట దాసు, కొట్టే శేషు, రామిశెట్టి శేషు, సింహాద్రి, కొట్టే విష్ణు తేజ, మద్దిశెట్టి శ్రీకాంత్, అన్నంగి రాజేష్, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రైతులు డ్రోన్ సేవలను వినియోగించుకోవాలి



**లింగసముద్రం, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
లింగసముద్రం మండలంలోని పెంట్రాల, లింగసముద్రం గ్రామాలలో ఇన్‌చార్జి మండల వ్యవసాయాధికారి సీహెచ్‌వీఎల్ దుర్గ పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు అందరూ తమ పరిధిలోని రైతు సేవా కేంద్రం సిబ్బంది ద్వారా రైతులందరూ రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను తప్పనిసరిగా పొందాలని సూచించారు. అదే విధంగా ప్రస్తుతం రైతుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం డ్రోన్ సేవలను ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకునే విధానాన్ని వివరించి చూపించారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సేవకులు గీత, దీప పాల్గొన్నారు.

### యాచకులుకు దుప్పట్లు పంపిణీ



**కందుకూరు పిబ్రవరి 10,ప్రభాతవార్త**
జీవనజ్యోతి దివ్యాంగ వికాస సేవా సమితి ఆధ్వర్యంలో కందుకూరులోని జెడిబిఎం టౌన్ బాప్టిస్ట్ చర్చ్ మరియు సోమేశ్వరస్వామి దేవస్థానం గల యాచకులకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. యడం జరిగింది. ఈ సందర్భంగా సేవాసమితి కార్యదర్శి శీలంవెంకటేష్ మాట్లాడుతూ దాతల సహకారంతో సంస్థ అనేక కార్యక్రమాలు కొనసాగిస్తుందన్నారు. చలికాలం దుప్పట్లు లేక ఇబ్బంది పడుతున్న యాచకులకు ఈ పంపిణీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు చనమాల శ్రీనివాసరావు, విశ్వ,నితీష్,శివకుమార్, బషీర్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

## పాలూరు దొండపాడులో పొలం పిలుస్తుంది



**కందుకూరు పిబ్రవరి 10,ప్రభాతవార్త**
మండలంలోని పాలూరుదొండపాడు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో గ్రామంలో సాగు చేస్తున్న ప్రత్తి మరియు మిరప పంటలను పరిశీలించారు.చీడపీడలను గుర్తించారు.వీటి నివారణకు ఒక ఎకరానికి 20 చొప్పున పసుపు రంగు జిగురు అట్టలను ఉపయోగిస్తే మంచి పలితాలు ఉంటాయన్నారు. నానో యూరియా పిచికారి చేయడం వలన మొక్కల పెరుగుదల మరియు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు జగదీష్ మరియు రైతులు పాల్గొన్నారు

## ఈ నెల 14,15 తేదీల్లో పాకలలో బీచ్ పెస్టివల్

**- కందుకూరులో మంగళవారం అవగాహన ర్యాలీ**

**- బారీగా తరలిరావాలి - ఎమ్మెల్యే ఇంటూరి**



**కందుకూరు పిబ్రవరి 10,ప్రభాతవార్త**
ఈ నెల 14, 15 తేదీలలో సింగరాయకొండ మండలం పాకల వద్దబీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు.రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యం లో నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున హాజరుకావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంపై అవగాహన నిమిత్తం మంగళవారం కందుకూరులో 2కె రన్ కార్యక్రమం ప్రదర్శన నిర్వహించారు.కోటారెడ్డి హాస్పటల్ జంక్షన్ నుంచి ఎన్టీయార్ సర్కిల్ వరకు బారీ ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మారీ టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, జెడ్పి సీఈవో చిరంజీవి, సబ్ కలెక్టర్ హిమవంశీ,డీఎస్పీ బాలసుబ్రమణ్యం,మున్సిపల్ కమిషనర్ అనూష,ఎంపీడీవో రత్నజ్యోతితోపాటు పలువురు అధికారులు నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ ప్రజలకు వినోదం,ఉల్లాసం అందించేనిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు బీచ్ పెస్టివల్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ రెండు రోజులపాటు నిర్వహించబోయే బీచ్ ఫెస్టివల్‌లో అనేక వినోద కార్యక్రమాలు ఉంటాయన్నారు.అనేక సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు బీచ్ అందాలను తిలకించేందుకు హెలికాప్టర్ రైడ్ కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సారధ్యంలో కందుకూరు నియోజకవర్గం పారిశ్రామిక కేంద్రంగా మారబోతోందని సత్య చెప్పారు. కందుకూరు ప్రాంతంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెద్ద ఎత్తున లభిస్తాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో కందుకూరు పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు,రాష్ట్రవిశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు,కూటమి పార్టీ నేతలు అధికారులు,ప్రైడ్‌మీడియా ఈవెంట్స్ ప్రతినిధులు,విద్యార్థులు పాల్గొన్నారు

## సకల పాపహరణం పాతాళ గంగ పుణ్యస్నానం



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
భూలోక కైలాసంగా ప్రసిద్ధిగాంచిన శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో పాతాళ గంగ పుణ్య స్నానానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. సకల పాపాలను హరించగల పవిత్ర జల ధారగా పాతాళ గంగకు ప్రత్యేక మహిమ ఉండడంతో ఉదయం నుంచే భక్తులు హర హర మహాదేవ శంభో శంకర, ఓం నమశ్శివాయ నమ: అంటూ ఘాటుల వద్ద బారులు తీరుతున్నారు. నల్లమల అడవుల నడుమ ప్రవహించే కృష్ణా నది జలాలతో ఏర్పడిన పాతాళగంగలో స్నానం చేయడం వలన ఆత్మశుద్ధి కలిగి, శివ కృప లభిస్తుందని భక్తుల విశ్వాసం. ముఖ్యంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలలో పాతాళ గంగకు విశేష ప్రాధాన్యత ఉంది. పుణ్యస్నానం అనంతరం భక్తులు మల్లిఖార్జున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని శ్రీశైల దేవస్థానం అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సకల పాప హరణం కలిగించే పాతాళ గంగ పుణ్యస్నానంతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందంతో మునిగితేలుతూ శ్రీశైలం యాత్రను మరుపురాని అనుభూతిగా మార్చుకుంటున్నారు.

## వై.చెర్లోపల్లి, చిలకచర్లలో పొలం పిలుస్తోంది



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల మండలంలోని ఎగువచెర్లోపల్లి, చిలకచర్ల గూడెం గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి.జవహర్‌లాల్ నాయక్ పాల్గొని గ్రామంలో సాగులో ఉన్న మొక్కజొన్న పంటలను సందర్శించడం జరిగింది. ప్రస్తుతం విత్తనం కొరకు సాగు చేసిన మొక్కజొన్న విత్తనాలు ఇచ్చిన కంపెనీ వారి వద్ద నుండి రైతులు తప్పనిసరిగా అగ్రిమెంట్ తీసుకోవాలని తెలిపారు. భూసార పరిరక్షణ పథకం, రైతు విశిష్ట నమోదు సంఖ్య రైతు యాప్ వాటి గురించి రైతులకు అవగాహన కల్పించారు. రబీలో సాగు చేసిన పంటలను 20.02.2026 లోపల ఈ పంట నమోదు చేసుకోవాలని రైతులకు తెలియజేశారు. అలాగే రైతు ఈకేవైసీ కూడా చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ శివనాయక్, వీఆర్వో చెన్నయ్య, రైతులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం లోపల పార్శిల్ సర్వీసు పాయింట్ లేదు

**- ప్రయాణ ప్రాంగణంలోనే సర్వీసు పాయింట్ ఉండాలని టెండరు నోటీసు**

**- ఏడాది గడిచిన ప్రయాణ ప్రాంగణంలో కనపడని పార్శిల్ సర్వీసు, ఎక్కడో బయట**



**యర్రగొండపాలెం, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
యర్రగొండపాలెం పట్టణంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం అభివృద్ధిలో భాగంగా పార్శిల్ సర్వీసు ప్రయాణ ప్రాంగణంలోనే ఉండాలనే తలంపుతో 10 ఇంటూ 10 స్థలాన్ని పార్శిల్ సర్వీసు పెట్టుకునేందుకు మార్కాపురం డిపో యాజమాన్యం గత సంవత్సరం 16-6-2025 యర్రగొండపాలెం ప్రయాణ ప్రాంగణంలో పబ్లిక్ నోటీసు వేసి టెండర్‌కు పిలిచిన విషయం తెలిసిందే. అయితే ఏడాది గడిచిన ప్రయాణ ప్రాంగణంలో మాత్రం ఆర్టీసీ వారి పార్శిల్ సర్వీసు కనపడటం లేదు. పార్శిల్ మాత్రం బయట ప్రధాన రహదారి బస్టాండ్ సెంటర్‌లోని పంచాయతీ భవన సముదాయపు రూము బయట దర్శనమిస్తున్నాయి. ఆ పార్శిళ్ళు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఉంటున్నాయి. ఆర్టీసీ వారికి సంబంధించిన పార్శిల్ సర్వీసు పాయింట్ అనే బోర్డు కూడా లేని పరిస్థితి ఇక్కడ దాపురించింది. ఎక్కడైన ఆర్టీసీకి సంబంధించిన పార్శిల్ సర్వీస్ పాయింట్ ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలోనే దర్శనమివ్వడం చూస్తుఉంటాం. ఇదేం విడ్డూరమో మార్కాపురం డిపో యాజమాన్యం పబ్లిక్ నోటీసు వేసి టెండరుకు పిలిచిన టెండరు దక్కించుకున్న వ్యక్తి పార్శిల్ సర్వీసు పాయింట్‌ను ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో పెట్టకపోవడం విచిత్రంగా గోచరించకమానదు. పార్శిల్ సర్వీసు పాయింట్ అనేది ఆర్టీసీ ్రయాణ ప్రాంగణంలో దర్శనమిస్తే ప్రజలకు, ప్రయాణికులకు తెలుస్తుంది. యర్రగొండపాలెం ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఆర్టీసీకి సంబంధించిన పార్శిల్ సర్వీసు పాయింటు ఉందనే ప్రచారం జరుగుతుంది. దాంతో వివిధ ప్రదేశాల నుంచి పార్శిళ్ళు ప్రయాణ ప్రాంగణానికి చేరే అవకాశం ఉంటుంది. వివిధ ప్రదేశాల నుంచి చేరే పార్శిళ్ళతో ప్రయాణ ప్రాంగణం రద్దీగా మారుతూ అక్కడి ప్రయాణ ప్రాంగణానికి శోభ చేకూరుతుందనే విషయం ఆర్టీసీ యాజమాన్యం గ్రహించక పోవడం శోభచనీయమే, ఇప్పటికైన ఆర్టీసీకి సంబంధించిన పార్శిల్ సర్వీసు పాయింట్ ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలోనే ఉండాలని సంబంధిత ప్రజలు ప్రయాణికులు కోరుతున్నారు.

### నల్లబర్లీ పొగాకు సాగు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు

**- పొలం పిలుస్తోందిలో మండల వ్యవసాయాధికారిణి**



**యర్రగొండపాలెం, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల అధికారులు మండలంలోని నర్సాయపాలెం,గంగపాలెం గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న మండల వ్యవసాయాధికారి కే.నీరజ మాట్లాడుతూ రైతు సోదరులందరూ ఐడీ కొరకు ఏపీఎఫ్ఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. దీని కోసం పట్టాదారు పాస్ పుస్తకం, ఆదార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబరు అవసరమని తెలిపారు. గ్రామాలలో రబీలో సాగు చేసిన పంటల వివరాల గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. భూసార పరీక్ష ఫలితాలను అనుసరించి ఎరువులు వాడాలని సూచించారు. చౌడు భూములకు తప్పనిసరిగా జిప్సం వేసుకోవాలని తెలిపారు.సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. రైతులు పొగాకు సాగుని తగ్గించి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న మినుము సాగు చేయాలని సూచించారు. కౌలు రైతులు సంబంధిత రెవెన్యూ శాఖ ద్వారా కౌలు రైతు గుర్తింపు కార్డులు పొంది ఈ పంట నమోదు చేయించుకోవచ్చని తెలిపారు. రైతులు నల్లబర్లీ పొగాకు సాగు చేయవద్దని ఎవరైనా నల్లబర్లీ పొగాకు సాగు చేసినా లేదా ప్రోత్సహించినా వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం రైతులతో కలిసి నర్సాయపాలెం, గంగపాలెం గ్రామ రైతు సోదరులకు ఏపీఎఫ్ఆర్ పోర్టల్‌లో నమోదు చేయించారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## శివస్వాములకు సుబ్బారెడ్డి అన్న వితరణ



**కురిచేడు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
కురిచేడు మండలంలోని శివ మాలధారణ చేసిన స్వాములకు కురిచేడులోని వాటర్ ప్లాంట్ యజమాని నుసుం సుబ్బారెడ్డి అన్న వితరణ చేశారు. మంగళవారం దీక్షలో ఉన్న శివ స్వాములకు శ్రీ జ్ఞాన ప్రసూన్నాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామి శివాలయంలో సుమారు 200 మంది స్వాములకు అన్న వితరణ చేశారు. బుధవారం నుంచి స్వాములు కాలినడకన శ్రీశైలంలో ఇరుముడి చెల్లించేందుకు వెళ్తుండటంతో సుబ్బారెడ్డి అన్నవితరణ చేసి శివస్వాముల నుంచి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా శివ స్వాములు సుబ్బారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కందుకూరులో సీఎం రిలీఫ్‌పండ్ చెక్కుల పంపిణీ

**- 55 మందికి రూ.53.58 లక్షల అందచేత**



**కందుకూరు పిబ్రవరి 10,ప్రభాతవార్త**
ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇందులో బాగంగా ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా అనేక మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందచేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో 55 మంది లబ్దిదారులుకు రూ.53.58లక్షల విలువైన సీఎంరిలీఫ్ పండ్ చెక్కులను పంపిణీ చేశారు.మండలాలవారీగా వలేటివారిపాలెంకు 10మందికిరూ.11.27 లక్షలు,లింగసముద్రంకు6గురికి రూ.5.16 లక్షల, కందుకూరుకు 8మందికి రూ.6.74లక్షలు,కందుకూరు టౌన్‌లో 9మందికి రూ.5.72లక్షలు, ఉలవపాడుకు 11మందికి రూ.13.98లక్షలు గుడ్లూరుకు 11మందికి రూ.10.72 లక్షల విలువైన చెక్కులను ఆయన అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గత 20నెలల్లో 1089మందికి రూ.9కోట్లు అందచేసినట్లు తెలిపారు.ఇందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలన్నారు.

### లడ్డులో కల్తీని నిర్ధారించిన సిట్ :

తిరుపతి లడ్డులో కల్తీ నెయ్యి విషయమై మాట్లాడుతూ దర్యాప్తుసంస్థ సిట్ కల్తీని నిర్ధారించిందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. అయినా వైసీపీ నేతలు తమ తప్పును సమర్ధించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.గతంలో వైసీపీ ప్రభుత్వం ఇలాంటి దారుణాలును ప్రజలు భరించలేక కేవలం 11సీట్లుకే పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. కల్తీ నెయ్యి పాపం ఆ పార్టీ మోయాల్సిందేనన్నారు.2029 ఎన్నికల్లో సైతం మళ్లీ వైసీపీకి దారుణ ఓటమి తప్పదన్నారు.ఈ కార్యక్రమంలో కందుకూరు,గుడ్లూరు, మండలపార్టీ అధ్యక్షులు బుస్సా రెడ్డి కృష్ణారెడ్డి,నాగరాజు పార్టీ నాయకులు షేక్ రఫీ,బెజవాడ ప్రసాద్, షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ విద్యను రైతులకు చేరువ చేయాలి



**దర్శి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
దర్శి మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం నందు దేశి బ్యాచ్ 2024-25కు ముగింపు వేడుకలు, 2025-26 ప్రారంభోత్సవ వేడుకలను కేవీకే హెడ్ జి.రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డాక్టర్ ఎన్‌వీఎస్ దుర్గ ప్రసాద్ మాట్లాడుతూ ఈ దేశి ఫ్రోగ్రాం డీలర్స్‌ని వ్యవసాయ విద్యని అభ్యసించడానికి, దానిని రైతులకు చేరువ చేయడానికి ఉయోగపడే ఉత్తమ కోర్సుగా చెప్పుకోవచ్చు. 2024-25 కోర్సులని అభ్యసించిన వారిని అభివర్ణించారు.అనంతరం దోర్నాల మండల పరిధిలోని గిరిజన రైతులకు వారికి ఉపయోగించు కోవాల్సిన స్ప్రేర్స్ టార్పాలిన్ పట్టలు అదే విధంగా ఇంటి పెరట్లో పెంచుకునే కోడి పిల్లలని అందజేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రవీంద్రబాబు, వెంకటేశ్వరరెడ్డి, మానస, ఏడీఏ బాలాజీ నాయక్, పి.భద్రాచలం తదితరులు పాల్గొన్నారు.

## 17వ విడత సామాజిక తనిఖీ కోఆర్డినేషన్ మీటింగ్



**ముండ్లమూరు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
ముండ్లమూరు మండలం నందు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 17వ విడత సామాజిక తనిఖీ కోఆర్డినేషన్ మీటింగ్ మంగళవారం నిర్వహించారు. రేపటి నుండి సామాజిక తనిఖీ గ్రామపంచాయతీలో నిర్వహించ బడునని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఆర్‌పీ మల్లిఖార్జునరావు, డీఆర్పీలు,ఏపీఓలు, కే.నాగరాజు, టి.వెంకట్రావు, ఈసీ శివరామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## సింగన్నపాలెం, మారెళ్ళలో పొలం పిలుస్తోంది



**ముండ్లమూరు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
ముండ్లమూరు మండలంలోని సింగన్నపాలెం, మారెళ్ళ గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు కే.బాలాజీనాయక్ మాట్లాడుతూ ప్రతి రైతు రబీ సీజన్ 2025-26 లో వేసిన ప్రతి పంటను పంట నమోదు చేసుకోవాలన్నారు. రబీ 2025-26 సీజన్లో సాగు చేసిన ప్రతి పంటలను ఈ పంట నమోదు చేయాలని చెప్పారు. ఈ పంట నమోదు ఉన్న రైతులకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలకు అర్హులవుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి తిరుమలరావు, వ్యవసాయ సహాయకులు వీరాంజనేయులు, రాధమణి, బాల వెంకటయ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం



**ముండ్లమూరు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మారెళ్ళ, పూరిమెట్ల, అగ్రహారం, ఈదర గ్రామాలలో హైస్కూల్ విద్యార్థినీ, విద్యార్థులకు కళ్ళజోళ్ళ పంపిణీ కార్యక్రమాన్ని డాక్టర్ సీహెచ్ ప్రవీణ్ కుమార్ నిర్వహించారు. మొత్తం 75 మందికి ఉచితంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ వారు ఆప్తాలమిక్ ఆఫీసర్ జే.ఉమ చే పరీక్ష చేయించి వారికి తగు సైట్ అంటే చూపు పరీక్షలు నిర్వహించిన అనంతరం వారికి ఉచితంగా కళ్ళజోళ్ళను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ సీహెచ్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఇది విద్యార్థినీ, విద్యార్థుల్లో చూపు సరి చేసి వారి యొక్క విద్యాభివృద్ధికి తోడ్పడుతుందని ఈ కార్యక్రమాన్ని భారతదేశంలో జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నారని దీనికి ప్రధానమంత్రి మోడీ,మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కేపీ రాజు హెల్త్ సూపర్‌వైజర్ ఏ.అంజమ్మ, ఏఎన్ఎం టి.పద్మ, ఆశా కార్యకర్తలు కౌసల్య తదితరులు పాల్గొని సహకారం అందజేశారు.

## కుమ్మిత అంజిరెడ్డిని పరామర్శించిన బూచేపల్లి



**దర్శి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
అనారోగ్యంతో ఒంగోలు సంఘమిత్ర హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రాష్ట్ర మున్సిపల్ వింగ్ ప్రధాన కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డిని మంగళవారం హాస్పిటల్‌లో పరామర్శించిన దర్శి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ప్రకాశం జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ.ఈసందర్భంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట వైసీపీ నాయకులు ఉన్నారు.

### ఒకటో తరగతి విద్యార్థులకు ఉచిత ప్రవేశ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**- బిజెపి రాష్ట్ర నాయకులు పీవీ కృష్ణారావు**



**మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యా హక్కు చట్టంలో ప్రైవేట్ పాఠశాలల నందు ఒకటో తరగతి విద్యార్థులకు ఉచిత ప్రవేశ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బిజెపి రాష్ట్ర నాయకులు పీవీ కృష్ణారావు కోరారు. మార్కాపురం జిల్లా కేంద్రంలోని దోర్నాల బస్టాండ్ సెంటర్లో గల భారతీయ జనతా పార్టీ కార్యాలయం నందు మంగళవారం జరిగిన సమావేశంలో పివి కృష్ణారావు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు నిండిన బాల బాలికలు ఒకటో తరగతి ప్రవేశానికి మూడు ప్రైవేటు పాఠశాలలను ఆన్లైన్ ద్వారా ఎంచుకోవచ్చని తద్వారా ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు ప్రభుత్వమే వారికి కావలసిన ఫీజులను చెల్లిస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందించే విద్యాహక్కు చట్టాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మీ మండల కేంద్రంలోని ఎంఇఓ కార్యాలయంలో నమోదు చేసుకోవచ్చని తెలిపారు.ఈ సమావేశంలో ఏ. సుబ్బారావు, చెంచయ్య, మద్దెల ప్రసాద్, సతీష్, బోయిన శీను, మురళి తదితరులు పాల్గొన్నారు.

### వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడిగా కంభం వెంకట రమణరావు నియామకం



**మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడిగా మార్కాపురం పట్టణానికి చెందిన కంభం వెంకట రమణరావు నియమితులయ్యారు.వైయస్సార్ కడప జిల్లా, కడపలో నిర్వహించిన వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్రస్థాయి సెమినార్ అవార్డు ఫంక్షన్ కార్యక్రమంలో ఇటీవల నూతన జిల్లాగా ఏర్పడిన మార్కాపురం జిల్లాకు సంబంధించిన కీలక నియామకం జరిగింది. ప్రభుత్వ నేషనల్ నీతి ఆయోగ్ అనుబంధంగా, అవినీతి నిరోధక శాఖతో కలిసి పనిచేస్తున్న వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మార్కాపురం జిల్లా అధ్యక్షుడిగా కంభం వెంకట రమణరావును అధికారికంగా నియమించారు. ఈ మేరకు నేషనల్ చైర్మన్ డాక్టర్ ఎం.ఆర్. అన్సారియా, రాష్ట్ర అధ్యక్షులు షేక్ మస్తాన్ సాహెబ్ చేతుల మీదుగా నియామక పత్రం మరియు అవార్డు మెమెంటోను వెంకట రమణారావు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నియామకం మార్కాపురం జిల్లాకు గర్వకారణంగా నిలిచిందన్నారు.

## ఉద్యోగుల సమస్యలపై ఎమ్మెల్యేకు ఏపీ యూటీఎఫ్ వినతి



**మార్కాపురం, ఫిబ్రవరి 10,ప్రభాతవార్త**
ఏపీ యూటీఎఫ్ ఉద్యోగ సంఘ నాయకులు స్థానిక మార్కాపురం ఎమ్మెల్యేను కలిసి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. పీఆర్‌సీ అమలు, పెండింగ్ డీఏలు, బకాయిల చెల్లింపు,పాత పెన్షన్ విధానం అమలు,హెల్త్ కార్డు సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలో అంశాలను ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

### శ్రీశైలం మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యేను ఆహ్వానించిన బోనేని రవణమ్మ



**గిద్దలూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త**
మార్కాపురం జిల్లా గిద్దలూరు పట్టణంలో నిర్వహించనున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డిని బోనేని రవణమ్మ, ఆమె భర్త కొమరోలు మండల పార్టీ అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు మర్యాద పూర్వకంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల ప్రాముఖ్యతను వివరిస్తూ, కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ఆశీర్వచనాలు అందించాలని కోరారు. ఎమ్మెల్యే ఆహ్వానాన్ని స్వీకరించి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలలో తప్పక పాల్గొని భక్తులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొంటానని తెలిపారు. మహా శివరాత్రి సందర్భంగా శ్రీశైలం దేవస్థానం వద్ద భక్తుల రద్దీ అధికంగా ఉండనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేపట్టాలని సూచించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలియజేయాలని బోనేని రవణమ్మను ఎమ్మెల్యే కోరారు.

## యుఎఫ్ఎస్ సర్వేను పరిశీలించిన ఎంపీడీవో సురేష్‌బాబు



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
సంతనూతలపాడు అంబేద్కర్ నగర్ నందు మంగళవారం సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న యుఎఫ్ఎస్ సర్వేను ఎంపీడీవో డి.సురేష్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే సిబ్బందికి ఎంపీడీవో సురేష్‌బాబు పలు సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు పంచాయతీ అభివృద్ధి అధికారి ఆర్.శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, బాలింతలకు మంచి పౌష్టికాహారాన్ని అందించాలి

**- రాష్ట్ర ఫుడ్ కమీషన్ సభ్యులు లక్ష్మీరెడ్డి వెల్లడి**



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, బాలింతలకు క్వాలిటీ పౌష్టికాహారాన్ని అందించాలని రాష్ట్ర ఫుడ్ కమీషన్ సభ్యులు ఇండేలా లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. సంతనూతలపాడు మండలం పి.గుడిపాడు మంగళవారం నాడు అంగన్‌వాడీ 1,2 కేంద్రాలను కమీషన్ రాష్ట్ర సభ్యులు లక్ష్మీరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులు 9 గంటలకు రావాల్సి ఉండగా 10 గంటల 30 నిమిషాలు అయినను పిల్లలు రాకపోవడంపై రాష్ట్ర కమీషన్ సభ్యులు లక్ష్మీరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజిష్టర్స్ సక్రమంగా నిర్వహించకపోవడం, కోడిగుడ్లు నిల్వ ఉండడం తదితర వాటిని ఆయన గుర్తించి ధ్వజమెత్తారు. ముఖ్యంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సావిత్రి, అంగన్‌వాడీ టీచర్ల పట్ల రాష్ట్ర కమీషన్ సభ్యులు లక్ష్మీరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సావిత్రి షోకాజ్ నోటీసు ఇవ్వాలని రాష్ట్ర డైరెక్టర్ లక్ష్మీ రెడ్డి ఆదేశించారు. 2 అంగన్‌వాడీ కేంద్రం నందు విద్యార్థులు హాజరు పట్టిక తప్పుగా వేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్ర పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం పట్ల ముఖ్యంగావిద్యార్థులు వ్యాధులు భారిన పడే అవకాశం కలదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల అభ్యున్నతకు పెద్ద మొత్తంలో నిధులు వెచ్చిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందజేయాలని ఫుడ్ కమీషన్ రాష్ట్ర సభ్యులు లక్ష్మీరెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు. సీడీపీవోలు, సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కేంద్రాలను నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ కేంద్రాల అభ్యున్నతకు మరింతగా పాటుపడాలన్నారు. తదుపరి గుడిపాడులోని మండల పరిషత్ యుపీ స్కూల్‌ను ఫుడ్ కమీషన్ రాష్ట్ర సభ్యులు లక్ష్మీరెడ్డి పరిశీలించారు. పాఠశాలలో ముఖ్యంగా వంటశాల స్లాబ్ దెబ్బతిన్నట్లు గుర్తించారు. మధ్యాహ్నం భోజనాన్ని పాఠశాలలో వండకుండా నిర్వాహకులు వారి ఇంటి వద్ద వండటంపై రాష్ట్ర కమీషన్ సభ్యులు లక్ష్మీరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకనుండి పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని తయారు చేస్తూ ఫొటోలు పెట్టాలని ఆయన ఆదేశించారు. ఫుడ్ కమీషన్ రాష్ట్ర సభ్యులు లక్ష్మీరెడ్డి వెంట జిల్లా పౌరసరఫరాల అధికారిణి ఎస్.పద్మశ్రీ, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీ నాయక్, సమగ్ర జిల్లా బాలిక సంరక్షణ అధికారిణి కే.హేమలత, డిప్యూటీ డీఈఓ చంద్రమౌలేశ్వర్, మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఇవాంజిలిన్,మండల పరిషత్ యూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతిస్వామి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సావిత్రి, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 2కే వాక్‌లో ప్రత్యేక ఆకర్షణగా ఎంహెచ్ఆర్ పాఠశాల విద్యార్థులు

**- పాకల బీచ్ ఫెస్టివల్ ప్రచారానికి కనిగిరిలో ఘనంగా 2కే వాక్**









**కనిగిరి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
పాకల బీచ్‌లో ఈనెల 14,15వ తేదీల్లో నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్ ప్రచారంలో భాగంగా మంగళవారం కనిగిరిలో నిర్వహించిన 2కే వాక్ కార్యక్రమం ప్రజాదరణ పొందింది. ఈ కార్యక్రమంలో కనిగిరి పట్టణానికి చెందిన ఎంహెచ్ఆర్ పాఠశాల విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జాతీయ జెండా రంగులతో కూడిన దుస్తులు ధరించి, చేతుల్లో బెలూన్లు పట్టుకుని వందలాది మంది విద్యార్థులు స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిలబడి హర్షధ్వానాలు చేయడం అందరిని ఆకట్టుకుంది. అలాగే ఎంహెచ్ఆర్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కోలన్న గేయాలు కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చాయి. మొబైల్ వినియోగాన్ని తగ్గించాలి, చెట్లను పెంచాలి, ప్లాస్టిక్ వినియోగాన్ని మానుకోవాలి, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి, ఆరోగ్యవంతమైన జీవనశైలిని అనుసరించాలి, ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలి అనే సందేశాలను విద్యార్థులు సాంస్కృతిక రూపంలో చక్కగా ప్రదర్శించారు. ఈ 2కే వాక్‌ను జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాకల బీచ్ రాబోయే రోజుల్లో జిల్లాకు తలమానికంగా నిలుస్తుందని తెలిపారు. కోస్తా జిల్లాలో పాకల బీచ్‌ను ఉత్తమ బీచ్‌గా అభివృద్ధి చేస్తామని చెప్పారు. జాతీయ రహదారికి కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ప్రజలకు రాకపోకలు మరింత సులభంగా ఉంటాయని వివరించారు. పాకల బీచ్‌లో ఈనెల 14,15వ తేదీల్లో రెండు రోజుల పాటు బీచ్ ఫెస్టివల్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. హెలికాప్టర్ రైడింగ్, వాటర్ స్పోర్ట్స్, వాలీబాల్ గేమ్స్, మ్యూజిక్ నైట్‌తో పాటు వివిధ రకాల ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కనిగిరి చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు కుటుంబ సమేతంగా హాజరై ఈ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ స్థాయిలో టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రకాశం జిల్లాలోని పాకల బీచ్ ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుందని ప్రజలంతా వచ్చి ఈ అనుభూతిని పొందాలని కోరారు. కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ బీచ్ ఫెస్టివల్‌కు కనిగిరి నుంచి వెళ్లే ప్రజల కోసం ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి ఉచిత బస్సు పాస్‌లు అందజేస్తామని చెప్పారు. నిరంతర ఒత్తిడితో పని చేసే ప్రజలకు ఈ బీచ్ ఫెస్టివల్ విశ్రాంతి, ఆనందాన్ని అందిస్తుందని అన్నారు. 2కే వాక్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలందరికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ కార్యాలయం వద్ద బీచ్ ఫెస్టివల్ ప్రచారార్థం బెలూన్లను గాలిలోకి ఎగరవేశారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద బీచ్ ఫెస్టివల్‌కు ఏర్పాటుచేసి ఉచిత బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రెవెన్యూ డివిజన్ అధికారి జాన్సన్, డీఎస్పీ సాయి ఈశ్వర్, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జయలక్ష్మీ, ఎంఎస్ఆర్ ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి, ఆక్స్‌ఫర్డ్ ప్రిన్సిపాల్ రాంబాబు, కళాశాల కరస్పాండెంట్ ఏలూరు సుబ్బారావు, విద్యుత్ శాఖ ఈఈ ఉమాకాంత్, మున్సిపల్ కమీషనర్ పర్వతనేని శ్రీధ్,ఏఎంసీ చైర్మన్ యారవ రమాదేవి శ్రీనివాసులు,ఆర్కే గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్ అధినేత పోలంరెడ్డి రామకృష్ణారెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు, మహిళలు, ప్రజలు, విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి నింపే లక్ష్యంగా జెర్సీల పంపిణీ




**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల మండలంలోని విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని మరింత పెంపొందించేందుకు సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో అందించిన జెర్సీ(టీషర్ట్స్) లను మండల విద్యాశాఖ పర్యవేక్షణలో మండల విద్యాశాఖ అధికారులు ఫిజికల్ డైరక్టర్లు అందజేశారు.ఈ మేరకు మంగళవారం దోర్నాల మండల వనరుల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బి.మస్తాన్ నాయక్, ఎంఈఓ 2 కొండలరావులు దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరక్టర్లు పి.రామానాయక్, హెచ్ రామా నాయక్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మస్తాన్ నాయక్ మాట్లాడుతూ విద్యాభ్యాసంతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. సర్వశిక్ష అభియాన్ ద్వారా అందించిన 100 టీ షర్టులను పాఠశాల స్థాయిలో క్రీడా కార్యక్రమాలను వినియోగించి విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు సిద్ధం చేయాలని ఫిజికల్ డైరక్టర్లకు సూచించారు. అలాగే ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారికి తగిన ప్రోత్సాహకం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 కొండలరావు, ఫిజికల్ డైరక్టర్లు పి.రామానాయక్, హెచ్ రామా నాయక్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ మెనూ తప్పనిసరిగా అమలు చేయాలి

**- రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఇండేల లక్ష్మీరెడ్డి**

**- గురుకులంలో నాసిరకం ఆహారం పై ఫుడ్ కమిషన్ ఆగ్రహం**





**సింగరాయకొండ,ఫిబ్రవరి 10,ప్రభాతవార్త**
ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని,నాణ్యతతో కూడిన ఆహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఇండేల లక్ష్మీరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం సింగరాయకొండలోని డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలో ప్రభుత్వం ఇచ్చిన మెనూ అమలు కావడం లేదని, సిబ్బంది తమకు నచ్చిన విధంగా స్వంత నిర్ణయాలతో మెనూ నిర్వహిస్తున్నారని ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన మెనూను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించగా, విద్యార్థులతో ఏర్పాటు చేసిన కమిటీ ఆమోదంతో మెనూను మార్చామని యాజమాన్యం సమాధానం చెప్పడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యార్థులకు సరిపడా కూరలు ఇవ్వడం లేదని గమనించిన కమిషన్ సభ్యులు, పిల్లలతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం స్టాక్ రూమ్‌ను పరిశీలించగా పాడైన వేరుశనగ పప్పులు కనిపించాయి. వెంటనే సాయి లోహిత ఏజెన్సీకి ఫోన్ చేసి ఇలాంటి నాసిరకం సరుకులు ఎందుకు పంపించారని ప్రశ్నిస్తూ, ఇవి తింటే పిల్లలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, వెంటనే వాటిని మార్చాలని ఆదేశించారు.ఈ విషయంపై ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించగా, తనకు సమాచారం లేదని, ఈ నెల స్టోర్ బాధ్యతలు చూసుకునే మేడమ్‌కు మాత్రమే తెలుసని సమాధానం ఇవ్వడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. 800 మంది విద్యార్థులు ఉన్న గురుకులంలో ఇలాంటి ఆహారం అందించడం తీవ్ర నిర్లక్ష్యమ్మని అన్నారు. ఈ వ్యవహారాన్ని సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ దృష్టికి తీసుకువెళ్తామని సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.అలాగే స్టాక్ రిజిస్టర్లు సరిగా నిర్వహించడం లేదని గుర్తించిన కమిషన్ సభ్యులు, ఇక్కడి పరిస్థితులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంచార్జి జిల్లా గురుకుల కోఆర్డినేటర్ అరుణకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు.ఈ తనిఖీలో డీడీ సోషల్ వెల్ఫేర్ లక్ష్మా నాయక్, డీఎస్‌వో పద్మశ్రీ, డీఎం సివిల్ సప్లైస్ వరలక్ష్మి, సమగ్ర శిక్ష జిల్లా బాలిక సంరక్షణ అధికారి హేమలత తదితర అధికారులు పాల్గొన్నారు.

## మారనున్న గిద్దలూరు మున్సిపల్ కార్యాలయం

**- మొదటి 3 ఫ్లోర్లు కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్**

**- పై రెండు అంతస్తుల్లో మున్సిపల్ కార్యాలయం ఏర్పాటు**

**- ఎమ్మెల్యే ముత్తుముల అదేశాలతో మున్సిపల్ కమిషనర్ రమణబాబు**

**- 10 కోట్లతో అనుమతుల కోసం ప్రతిపాదనలు**



**గిద్దలూరు, ఫిబ్రవరి 10,ప్రభాతవార్త**
గిద్దలూరు పట్టణం నడిబొడ్డున ఉన్న మున్సిపల్ కార్యాలయం స్థానంలో భారీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చకచకా అడుగులు పడుతున్నాయి. మొదటి 3 అంతస్తుల్లో షాపింగ్ కాంప్లెక్స్, పై రెండు అంతస్తులలో మున్సిపల్ కార్యాలయాన్ని నిర్మిస్తారు. ఇందుకు అవసరమయ్యే నిధుల మంజూరు కోసం శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంలోని మున్సిపల్ శాఖ ద్వారాప్రయత్నాలు మొదలుపెట్టారు. పట్టణంలోని వీధులన్నీ చిన్నవిగా ఉండడంతో చిరువ్యాపారులు రోడ్లపైనే వ్యాపారాలు చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. దానికితోడు ఒక మాదిరి వ్యాపారం చేయాలన్నా గదుల కొరత వేదిస్తున్నది. వీటన్నింటికీ పరిష్కారం కోసం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణ నడిబొడ్డున ఉన్న మున్సిపల్ కార్యాలయం ఇరుకుగా ఉండడంతో కొత్త భవన నిర్మాణానికి రూ.10కోట్ల మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కార్యాలయ ప్రాంగణం, చుట్టూ ఉన్న స్థలం సుమారు 56 సెంట్లు ఉండగా పక్కనే ఉన్న కూరగాయల మార్కెట్ స్థలం కూడా మున్సిపాలిటీదే. అదీ ఇదీ కలుపుకుంటే సుమారు 65 సెంట్లు వస్తుంది. కార్యాలయ భవనం, చుట్టూ ఖాళీ స్థలంలో 5 అంతస్తుల భారీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి అందులో మొదటి 3 అంతస్తులు వ్యాపారుల కోసం, పైన ఉన్న 2 అంతస్తులు మున్సిపల్ కార్యాలయం కోసం వినియోగించే విధంగా తాత్కాలిక ప్లాన్ రూపొందించారు. వ్యాపారులకు ఒక లిఫ్ట్, కార్యాలయానికి వెళ్లే ఉద్యోగులు, ప్రజల కోసం మరో లిఫ్టును ఏర్పాటు చేస్తే ప్రతినెలా అద్దెల రూపంలో మున్సిపాలిటీకి లక్షల రూపాయల ఆదాయం లభిస్తుంది. దానికితోడు వందలాది మంది చిరు, మధ్యతరగతి వ్యాపారులకు తక్కువ అద్దెతో వ్యాపారాలు చేసుకునే వెసలుబాటు కూడా కలుగుతుంది. ఈప్రాంతం పట్టణ నడిబొడ్డున ఉండడంతో వ్యాపారాలకు కూడా డోకా ఉండదు. పీపీపీ పద్ధతిలో షాపింగ్ కాంప్లెక్స్, కార్యాలయ భవనం నిర్మిస్తే నిర్మాణ వ్యయానికి ప్రభుత్వంపై కూడా పెద్దగా భారం ఉండదు. బ్యాంకర్ల నుంచి సులభంగా రుణం పొందే అవకాశం ఉంటుంది. మున్సిపల్ అధికారులు ఆమేరకు ప్రాథమిక అంచనాలతో ప్రభుత్వానికి నివేదిక పంపగా వీటి మంజూరు కోసం స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, కమిషనర్ ఇవి రమణబాబు ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు. కార్యరూపం దాల్చితే వందలాది మంది వ్యాపారులకు తక్కువ అద్దెతో వ్యాపారాలు చేసుకునే అవకాశం కలుగుతుంది. దీనికితోడు స్టేషన్ రోడ్డులో గల పాత మహిళ బ్యాంక్ స్థలంలో కూడా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు నిధుల మంజూరు కోసం కూడా ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

## గ్రామాభివృద్ధే లక్ష్యం

**- రాయవరం-2 స్వర్ణ గ్రామ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డిప్యూటీ ఎంపీడీవో**



**మార్కాపురం, ఫిబ్రవరి 10,ప్రభాతవార్త**
మార్కాపురం మండలంలోని రాయవరం-2 స్వర్ణ గ్రామ కార్యాలయాన్ని డిప్యూటీ ఎంపీడీవో (ఎస్‌జిఎస్‌డబ్ల్యూ) ఎస్‌కే ఖాజా మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ కార్యాలయం లోని సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించడంతో పాటు, వారు నిర్వహిస్తున్న వివిధ రికార్డులను సమగ్రంగా తనిఖీ చేశారు. తదుపరి గ్రామంలో సిబ్బంది నిర్వహిస్తున్న యూఎఫ్‌ఎస్ సర్వే పనుల తీరును పరిశీలించిన డిప్యూటీ ఎంపీడీవో,మండల ప్రగతి మరింత మెరుగుపడేలా సిబ్బందికి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలవ్వాలన్నదే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలో ఐవిఆర్ కాల్స్, శానిటేషన్ పనులు, ఇంటి పన్నుల వసూళ్ల తదితర అంశాలపై స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొంటూ, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-ఫైవ్ సిబ్బంది, ఎస్ జిఎస్‌డబ్ల్యూ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో సూచించారు.

## గ్రామాల నుంచే వైఎస్సార్‌సీపీ బలోపేతం లక్ష్యం : అన్నా రాంబాబు



**మార్కాపురం, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
గ్రామస్థాయి నుంచే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు విస్తృత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.ఈ క్రమంలో మంగళవారం మార్కాపురం మండలంలోని జమ్మనపల్లె, కె కొత్తపల్లె గ్రామాలను ఆయన సందర్శించి పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సమావేశాల్లో గ్రామ కమిటీలను అధికారికంగా ప్రకటించిన ఆయన పార్టీ పటిష్ఠతకు గ్రామ కమిటీలే పునాది అని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త పార్టీకి బలమైన స్థంభంలా ఉండాలని, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడే విధంగా పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలతో సన్నిహిత సంబంధాలు పెంచుకుంటూ పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు విస్తృతంగా వివరించాలని, వాటి లబ్ధిని అర్హులందరికీ చేరేలా కృషి చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.రానున్న రోజుల్లో పార్టీ ఎదుర్కొనే రాజకీయ పోరాటాలకు ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామస్థాయి నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పార్టీ బలోపేతానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

## అలరించిన కళాజాత



**వలేటివారిపాలెం, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు వలేటివారిపాలెం అవార్డు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పోలినేనిపాలెం గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత డిజిటల్ అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాజాత కళాకారులు పాటల ద్వారా ఆర్థికంగా ఎదుగుదల జాగ్రత్తలను తెలిపారు. మేనేజర్ సురేష్ కుమార్ డిపాజిట్ లోన్ల గురించి వివరించారు. గ్రామస్తులు శ్రద్ధగా విన్నారు. వ్యాపార ప్రతినిధి రత్నబాబు బ్యాంకు సేవలను గురించి వివరించారు. ఫీల్డ్ ఆఫీసర్ రవికిరణ్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

## ఎయిడెడ్ ఉపాధ్యాయులు,విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

**- ఏపీ టీచర్స్ గిల్డ్ డిమాండ్**



**సింగరాయకొండ, ఫిబ్రవరి 10,ప్రభాతవార్త**
ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులు, అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్షుడు కోడూరి వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్. ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని 136 ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 10,500 మంది విద్యార్థులకు ఇప్పటివరకు బెంచీలు, ప్యానల్ బోర్డులు, స్పోర్ట్స్ మెటీరియల్, ఎఫ్ఎల్ఎన్ కిట్లు ప్రభుత్వం సరఫరా చేయలేదని పేర్కొన్నారు. అలాగే ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న 593 మంది ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బందికి ఎన్టీఆర్ ట్రస్ట్ ఆరోగ్య కార్డులు మంజూరు కాలేదన్నారు.సేవలో ఉన్నప్పుడే మృతి చెందిన ఎయిడెడ్ ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాలపై జీఓ విడుదల చేయకపోవడం అన్యాయమని తెలిపారు. ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పూర్తి సర్వీస్ లాభాలు కల్పించాలని, ప్రస్తుతం పనిచేస్తున్న తెలుగు, హిందీ, సంస్కృత, పీఈటీ ఉపాధ్యాయులకు పదోన్నతి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.అలాగే ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు సంబంధించిన గ్రాట్యూటీ, సరెండర్ లీవ్, డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశాలపై తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు.

## టీడీపీ నేత శ్రీనివాస్‌రెడ్డి గుండెపోటుతో మృతి





**తాళ్లూరు, ఫిబ్రవరి10,ప్రభాతవార్త**
టీడీపీ సీనియర్ నేత ఇడమా కంటి శ్రీనివాస్ రెడ్డి (45) గుండె పోటుతో మంగళవారం ఉదయం మృతి చెందారు. తాళ్లూరు చెందిన శ్రీనివాస్ రెడ్డి టీడీపీలో క్రియాశీలకంగా పనిచేస్తూ పార్టీ అభ్యున్నతికి కృషి చేశారు.మంగళవారం గుండె పోటు రావడంతో హుటాహుటిన ఒంగోలు హాస్పిటల్ కు తరలించారు.హాస్పటల్‌లో మృతి చెందాడు. తండ్రి వెంకటరెడ్డి పార్టీలో చురుకైన పాత్ర పోషించేవాడు. శ్రీనివాస్ రెడ్డి 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేశాడు. శ్రీనివాస్ రెడ్డి మృదుస్వభావి, అందరితో ఆప్యాయంగా కలిసిమెలిసి ఉండేవాడు.అయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీనివాస్ రెడ్డి మృతదేహాన్ని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్ చార్జ్ డాక్టర్ గొట్టి పాటి లక్ష్మి, నాయకుడు డాక్టర్ కడియాల లలిత్ సాగర్,మాజీ ఎమ్మెల్యేలు నారపుశెట్టి పాపారావు, బాచిన చెంచు గరటయ్య, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి బావమరిది బెజవాడ సురేష్ రెడ్డి, హర్షిణి కాలేజీ అధినేత గోరంట్ల రవికుమార్, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య సందర్శించి నివాళులర్పించారు.కుటుంబసభ్యులకు ఓదార్చి,ప్రగాఢ సానుభూతి తెలిపారు.నివాళుల్పంచినవారిలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు ,టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వర రెడ్డి, రాష్ట్ర నాటక అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిరెడ్డి ఓబుల్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఐ. వెంకటేశ్వర రెడ్డి, నాయకులు మానం రమేష్ బాబు, గొల్లపూడి వేణుబాబు, సొసైటీ అధ్యక్షులు గొంది రమణారెడ్డి ( సమర) సుబ్బయ్య,కైపు రామకోటి రెడ్డి, రాచకొండ వెంకట్రావు, వెలుగు సుబ్బారావు, పిన్నిక రమేష్, కైపు నాగార్జునరెడ్డి, పుట్టా నరసింహారావు, బొడ్డు హనుమా రెడ్డి, గంగిరెడ్డి కృష్ణారెడ్డి, యాతం చవిట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,నవులూరి సాగర్, యత్తపు కాశిరెడ్డి,రవి నూతల పరిశుద్ధ రావు,చాట్ల డానీ,కళ్యాణ్, కోనేటి వెంకట్రావులు ఉన్నారు.

## త్వరలో సొంతగూటికి జిడుగు మస్తాన్‌రావు



**వేటపాలెం, ఫిబ్రవరి 10 ,ప్రభాతవార్త**
తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే పార్టీతో కలిసి నడిచిన సీనియర్ నాయకుల్లో జిడుగు మస్తాన్ ఒకరు పార్టీ బలోపేతం కోసం సంవత్సరాల తరబడి కష్టపడిన నేతగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది.రాజకీయ పరిణామాలు అనివార్య కారణాల నేపథ్యంలో కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న జిడుగు మస్తాన్ ఇప్పుడు మళ్లీ సొంతగూటికి చేరేందుకు సిద్ధమవుతున్నారు.గత ఆదివారం నాగర్పమ్మ దేవస్థానంలో జరిగిన కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యను జిడుగు మస్తాన్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య రాజకీయ పరిణామాలు పార్టీ భవిష్యత్ కార్యచరణపై విస్తృతంగా చర్చలు జరిగినట్లు సమాచారం పార్టీకి దూరంగా ఉన్న కాలాన్ని స్వయంగా ప్రస్తావించిన జిడుగుమస్తాన్ ఇకపై పూర్తి స్థాయిలో తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా కొనసాగుతానని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ అంటే కేవలం రాజకీయ వేదిక మాత్రమే కాదని ఇది ఒక ఉద్యమమని ఒక భావజాలమని ఆయన వ్యాఖ్యానించినట్లు తెలిసింది. పార్టీ కోసం చివరి రక్తబొట్టు వరకు సేవలందిస్తానని చంద్రబాబునాయుడు నాయకత్వంలో పార్టీ బలోపేతానికి తాను మరింత కష్టపడతానని ఆయన వెల్లడించారు. ఎమ్మెల్యే ఎంఎం మాలకొండయ్య సూచనలతో తన పునఃప్రవేశం ఖరారైనట్లు సమాచారం మార్చి 1వ తేదీన సాయంత్రం 6గంటలకు వేటపాలెంలో మస్తాన్ స్వగృహంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సమక్షంలో జిడుగు మస్తాన్ అధికారికంగా పార్టీలో చేరనున్నారు. ఈ కార్యక్రమానికి జిడుగు మస్తాన్ కుటుంబ సభ్యులు,స్నేహితులు, శ్రేయోభిలాషులు, అనుచరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉంది.ఈమేరకు తన నిర్ణయాన్ని ఎమ్మెల్యే మాలకొండయ్యకు జిడుగు మస్తాన్ తెలియజేశారు. స్థానిక రాజకీయాల్లో దీని ప్రభావం గణనీయంగా ఉండనుందన్నచర్చ జోరుగా సాగుతోంది. అనుభవజ్ఞుడైన నాయకుడి పునఃప్రవేశం తెలుగుదేశం పార్టీకి బలమవుతుందన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ముఖ్యంగా కార్యకర్తల్లో ఉత్సాహం పెరగనుందని రాబోయే రాజకీయ సమీకరణాల్లో ఇది కీలక మలుపుగా మారే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## వెట్టి చాకిరి నిర్మూలనపై ప్రజలకు అవగాహన



**రాచర్ల, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
వెట్టి చాకిరి నిర్మూలన చట్టం అమల్లోకి వచ్చి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ ఎస్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ వెట్టి చాకిరి చట్టరీత్యా నేరమని దీనిని ప్రభుత్వం కఠినంగా నిషేధించిందని అన్నారు. వెట్టి చాకిరి బలవంతపు శ్రమని దానిని నిర్మూలించడమే ఏకైక మార్గమని అందుకు ప్రతి ఒక్కరం బాధ్యతగా నిర్మూలనకు అందరం కలిసి కృషి చేద్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు ఐ వెంకటేష్, ఓవికెఎస్ కుమార్, ఎంఈఓలు గిరిధర్ శర్మ, మోయునుద్దీన్, వెలుగు ఏపిఎం నరేష్, పిఆర్ఏఈ రంగస్వామిరెడ్డి,ఎన్జీవో ప్రతినిధులు సిహెచ్ ఏలియా, కె అనోజీరావు, పి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి

**- మండల వ్యవసాయాధికారి రవికుమార్**



**హనుమంతునిపాడు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
హనుమంతునిపాడు మండలంలో వ్యవసాయ భూమి కలిగిన ప్రతి రైతు తప్పకుండా తమ యొక్క రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించి ఆధార్ తరహా 11 అంకెల రైతు విశిష్టసంఖ్య కొరకు వెంటనే నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రవికుమార్ తెలిపారు. మండల కేంద్రమైన హనుమంతునిపాడు గ్రామంలో రైతులకు విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పథకాలు అయినటువంటి పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల భీమా, రాయితీపై సూక్ష్మ సేద్య, వ్యవసాయ పరికరాలు, అలాగే సబ్సిడీపై విత్తనాలు, సూక్ష్మ పోషకాలు, ఎరువులు పొందుటకు రైతులు తప్పనిసరిగా విశిష్ట గుర్తింపు సంఖ్య కలిగి ఉండాలని తెలిపారు. మండలంలో వ్యవసాయ భూమి కలిగి ఇతర ప్రాంతాలకు తాత్కాలిక వలస వెళ్లిన రైతులు కూడా ఈ విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్ చేసుకునేలా గ్రామాలలో వ్యవసాయ సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ గ్రామ నాయకులు, పెద్దలు సహకారంతో వివిధ ప్రాంతాలకు జీవనోపాధి కోసం వలస వెళ్లిన రైతులను గుర్తించి వారందరికి త్వరితగతిన విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని రైతు సేవ కేంద్ర సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రసూల్,వ్యవసాయశాఖ సిబ్బంది ఖదీర్ అహ్మద్,నవ్య, కళ్యాణి ఈశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ఓవర్ టెక్ ప్రయత్నంలో ఘోర ప్రమాదం

**- మోటారు సైకిలిస్టు మృతి**



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
ముందున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయిన సమయంలో ఓ మోటారు సైకిలిస్టు ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం పెద్దదోర్నాల మండల పరిధి శ్రీశైలం ఘాట్ రోడ్డు చిన్నారుట్ల సమీపంలో జరిగింది.ఈ సంఘటనలో తెనాలికి చెందిన బ్రహ్మేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. శివ దీక్ష విమరణ చేసేందుకు మోటారు బైక్‌పై శ్రీశైలం వెళ్తున్నారు. ముందుగా టిప్పర్ వెళ్తుంది. ఆ టిప్పర్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న తుఫాన్ వాహనాన్ని ఢీకొంది. దీంతో ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాద ప్రాంతంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

8_8.qxd 2/11/2026 12:07 AM Page 1



## డైవర్షన్ పాలిటిక్స్ కోసమే శ్రీవారి లడ్డుపై తప్పుడు ఆరోపణలు - దద్దాల

- లడ్డూ ప్రసాదంపై కొనసాగుతున్న చంద్రబాబు అబద్ధాలు
- బాత్రూమ్ కడిగే రసాయనాలు వాడారంటూ దిగజారుడు వ్యాఖ్యలు
- రాజకీయ లబ్ధి కోసమే శ్రీవారి కేంద్రంగా విష ప్రచారం దుర్మార్గం





**కనిగిరి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**

తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు చేసిన ప్రచారం అబద్ధమని సీబీఐ సిట్ ఛార్జిషీట్ సాక్షిగా బట్టబయలు కావడంతో తమపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత నుంచి బయటపడడానికి కూటమి నేతలు డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా శ్రీవారి లడ్డుపై మరింత దుష్ప్రచారానికి తెగబడుతున్నారని కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గం పరిశీలకులు కసుకుర్తి ఆదేన్న స్పష్టం చేశారు. కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో మంగళవారం మీడియాతో వారు మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబు చేసిన కుట్రలే కూటమి ప్రభుత్వానికి ఊరితాడులా బిగుసుకున్నాయని తేల్చి చెప్పారు. చేసిన తప్పుకు పశ్చాత్తాపం లేకుండా మరలా లడ్డులో కల్తీ జరిగిందని ప్రజలను నమ్మించడం ద్వారా వైఎస్సార్‌సీపీ నేతలను జైళ్లకు పంపించడమే లక్ష్యంగా ఏకసభ్య కమీషన్ ఏర్పాటు చేస్తున్నారని మండిపడ్డారు. దీని ద్వారా తమకు నచ్చిన నివేదిక రాయించుకోవడమే ఏకసభ్య కమీషన్ ఏర్పాటు వెనుకున్న లక్ష్యమని తేల్చి చెప్పారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల్లో కోల్పోయిన విశ్వాసాన్ని తిరిగి సంపాదించలేక నానా అగచాట్లు పడుతోందన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు, మంత్రులు చేసిన తప్పుడు ప్రచారం ప్రభుత్వానికి ఉరి తాడులా బిగుసుకుందని, వైఎస్ జగన్‌ని రాజకీయంగా ఎదుర్కోలేక వైఎస్సార్‌సీపీ మీద బురదజల్లి రాజకీయ లబ్ధి పొందాలన్న దుర్బుద్ధితో కలియుగదైవం శ్రీ వెంకటేశ్వరుడి లడ్డూ ప్రసాదంపై మోపిన నిందలు ఇప్పుడు కూటమి ప్రభుత్వాన్ని దహించి వేస్తున్నాయి. సీబీఐ సిట్ దర్యాప్తు చేసి రూపొందించిన చార్జిషీట్‌లో జంతవుల కొవ్వు కలవలేదని ల్యాబ్ రిపోర్టుల ఆధారాలతో సహా వెల్లడించడంతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చేసిన కుట్రలు బట్టబయలయ్యాయి. దాన్నుంచి బయటపడలేక చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సహా కూటమి నాయకులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా చేసిన తప్పుకి పశ్చాత్తాపం ప్రకటించి ప్రజలకు క్షమాపణ చెప్పకుండా నివేదిక తమకు అనుకూలంగా లేదనే ఆవేదనతో ఇంకా దిగజారిపోయి తప్పులు మీద తప్పులు చేస్తున్నారు. లడ్డు తయారీలో జంతవుల కొవ్వు కలిసిందని ఎలాగైనా ప్రజలను నమ్మించడానికి స్వామివారి పవిత్రతను ఇంకా దెబ్బతీయడానికి కూడా వెనుకాడటం లేదన్నారు. సీఎంగా ఉన్న చంద్రబాబు భక్తుల విశ్వాసాలను మరింత దెబ్బతీసేలా బాత్రూమ్ క్లీనింగ్‌కి వాడే హార్పిక్ వంటి కెమికల్స్‌ని లడ్డూ తయారీకి వాడారని దిగజారుడు వ్యాఖ్యలు చేశాడు. నిజంగా ఆయన చెప్పినట్టు అలాంటి ప్రాణాంతకమైన కెమికల్స్‌తో లడ్డూరి తయారు చేస్తే తిన్నవారు బతికుంటారా..? ప్రశ్నించారు. తిరుమలేశుడు మా ఇంటి దైవం అని చెప్పుకుంటూనే ఆయన ప్రతిష్ఠను దెబ్బతీసేలా భక్తుల విశ్వాసాలను ప్రశ్నార్థకం చేసేలా వ్యవహరించడం కరెక్టా కాదా అనే ఆలోచన చేయడం లేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన క్షణం నుంచి రాజకీయ ప్రయోజనాల కోసం చంద్రబాబు అనుక్షణం తిరుమల శ్రీవారిని వివాదాల్లోకి లాగుతున్నాడు. రెండు మూడు రోజుల పాటు ఆయనే ఎల్లో మీడియాలో , టీడీపీ సోషల్ మీడియాలో ప్రచారం చేయించి దాన్ని తీసుకొచ్చి పత్రికలు రాశాయని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేయడం సిగ్గుచేటు, ఆవు కొవ్వు, పంది కొవ్వు, చేపల నూనె కలిసిందని వారు చేసిన ప్రచారం సీబీఐ సిట్ చార్జిషీట్‌తో వికటించడంతో బాత్రూమ్‌లు కడిగే రసాయనాలు వాడారు అంటూ కొత్త డ్రామాకు తెరదీశాడు. ఏకసభ్య కమీషన్ ఏర్పాటు చేసి ఎలాగైనా తాము అనుకున్నట్టు వైఎస్సార్‌సీపీ నాయకులను జైళ్లకు పంపాలనే దురుద్దేశంతో ఇలాంటి తప్పుడు సాంప్రదాయానికి చంద్రబాబు తెరదీశాడు. వైఎస్ జగన్ ప్రతిష్ఠను దిగజార్చడమే లక్ష్యంగా ఇలాంటి చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని, ఇప్పుడు కూడా చంద్రబాబు తన రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చడం కోసమే వైఎస్ జగన్‌ని, వైఎస్సార్‌సీపీని ఇబ్బంది పెట్టడం కోసం చేస్తున్న దుశ్చర్య అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఓకేరెడ్డి, గాయం బలరామిరెడ్డి, గోపవరపు బొర్రారెడ్డి, యక్కంటి శ్రీనివాసులరెడ్డి, కటికల వెంకటరత్నం, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, రాచపూడి మాణిక్యరరావు, పులి శాంతి, ఆవుల భాస్కర్‌రెడ్డి, సిరుప గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, షేక్ రహీంభాష, సంగు వెంకటేశ్వరరెడ్డి, గుదే రమణయ్య చౌదరి, కంటు గురవయ్య, బత్తుల మాలి, బాపట్ల కొండలరావు, డబ్బుకొట్టు రవికుమార్, కొర్రపాటి ఓబులేసు, మేకల మాల్యాద్రి, పెరికల వెంకటేశ్వర్లు, పాపసాని శ్రీనివాసరెడ్డి, కనమర్ల వెంకటేశ్వర్లురెడ్డి, మైల కొండయ్య, లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, లక్కిరెడ్డి హనుమారెడ్డి, యాల్ల కృష్ణారెడ్డి, మూలే యోగిరెడ్డి, భూమిరెడ్డి కొండారెడ్డి, పరుచూరి రమేష్ గౌడ్, కసిరెడ్డి రామసుబ్బారెడ్డి, రాపూరి అంజయ్య, మేడం కృష్ణారెడ్డి, గుంటక రమణారెడ్డి, శ్యామల సాంబిరెడ్డి, కస్తాల బాలాజీ, సానికొమ్ము వెంకటేశ్వర్‌రెడ్డి, కలికాయి నారాయణ, సైకం ఏడుకొండలు రెడ్డి, నాలి వెంకటేశ్వర్లు, గొడ, తమ్మనేని రమణారెడ్డి, గోడి నారాయణరెడ్డి, పల్లపోలు శ్రీనివాసరెడ్డి, కాసుల బాలయ్య, బొట్టు శ్రీను, బత్తుల ఏడుకొండలు, వేముల సురేషన, పైడిమర్రి ఫణి కుమార్, రాచర్ల నరేష్, షేక్ సన్నీ, షేక్ అలుగోజిమస్తాన్, వెన్నపూస నారాయణరెడ్డి, మల్లెల వెలుగొండయ్య, తమ్మినేని శివరామిరెడ్డి, బలసాని యోహోషువ, షేక్ నాగూర్ వలి, షేక్ రెహమాన్, చిన్ని గారి కొండలు, మూలే శ్రీనివాసులురెడ్డి, యర్రబల్లి ఆంథోని, సూరా మాల్యాద్రిరెడ్డి, తిరుమలపూడి మహేష్, సానికొమ్ము తిరుపతిరెడ్డి, కాసుల బాల గురవయ్య, పోతిరెడ్డి రమణారెడ్డి, రాపూరి మురళి, పాలువాది జగదీష్, పైడాల మోహన్‌రెడ్డి,అత్యాల ఇసాక్, మాదాల శ్రీను,పొంద్రీ కొండారెడ్డి,సంగటి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్న సాయి కృష్ణ ఆసుపత్రిని అభినందించిన బత్తుల బ్రహ్మానందరెడ్డి

- కనిగిరిలో సాయి కృష్ణ ఆసుపత్రి సందర్శించిన ఒంగోలు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి



**కనిగిరి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**

వెనుకబడిన ప్రాంతంలో అన్ని హంగులతో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న సాయి కృష్ణ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అధినేత డాక్టర్ పెరుగు మురళీకృష్ణ యాదవ్ అభినందనీయులని ఒంగోలు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు, పార్టీ సీనియర్ నాయకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం కనిగిరిలోని సాయి కృష్ణ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సదుపాయాలు చికిత్స విధానాలు, ఆధునిక పరికరాల వినియోగంపై వివరాలను తెలుసుకున్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆసుపత్రి అధినేత డాక్టర్ పెరుగు మురళి కృష్ణ యాదవ్‌తో భేటీ అయ్యారు. వెనుకబడిన ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అన్ని విభాగాల్లో వైద్య సేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. ఇటువంటి ఆసుపత్రులు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెట్టిచాకిరి నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

- వెట్టిచాకిరి నిర్మూలన చట్టంపై కనిగిరిలో అవగాహన కార్యక్రమం
- తహసీల్దార్ జయలక్ష్మీ



**కనిగిరి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**

వెట్టి చాకిరి నిర్మూలన చట్టంపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగిఉండాలని కనిగిరి మండలం తహసీల్దార్ జయలక్ష్మీ అన్నారు.వెట్టి చాకిరి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా వెట్టిచాకిరి నిర్మూలన చట్టం అమలులోకి వచ్చి 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని న్యాయ సేవాదికార సంస్థ మార్కాపురం జిల్లా వెట్టి విమోచన కూటమి, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వెట్టి విమోచన కూటమి ఆధ్వర్యంలో వెట్టి చాకిరి నిర్మూలనపై రూపొందించిన అవగాహన కరపత్రాన్ని తహసీల్దార్ జయలక్ష్మీ ఆవిష్కరించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ వెట్టి చాకిరి ఒక నేరమని, బలవంతపు పనులు చేయించడం చట్టరీత్యా శిక్షార్హమని స్పష్టం చేశారు. ఎవరికైనా వెట్టి చాకిరి సమస్య ఎదురైతే సంబంధిత అధికారులను,పోలీసు శాఖను లేదా న్యాయ సేవాదికార సంస్థను సంప్రదించాలని సూచించారు.ప్రజలందరూ ఈ చట్టంపై అవగాహన పెంచుకుని తమ హక్కులను కాపాడుకోవాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో పారాలీగల్ వాలంటీర్ వెట్టి విమోచన కూటమి కనిగిరి డివిజన్ కన్వీనర్ గుడ్‌హెల్ప్ రమేష్‌బాబు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్రం వారి పాలెం వద్ద బైక్ ప్రమాదం : వ్యక్తి మృతి



**అద్దంకి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త**

మండలంలోని గుర్రంవారిపాలెం వద్ద జరిగిన బైక్ ప్రమాదంలో మార్టూరు మండలం తాటివారిపాలెంకు చెందిన మర్రి శేషయ్య మృతిచెందారు.

## కనిగిరిలో వైసీపీ పార్టీ బలోపేతమే లక్ష్యం

- దద్దాల నారాయణ
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సంస్థాగత కమిటీల సమావేశం
- ముఖ్య అతిధులుగా బత్తుల బ్రహ్మానందరెడ్డి, కసుకుర్తి ఆదేన్న



**కనిగిరి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకుడు కలిసికట్టుగా పని చేయాలని కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పిలుపునిచ్చారు. కనిగిరి స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సంస్థాగత కమిటీల నిర్మాణ సమావేశంలో ఆయన ముఖ్య ప్రసంగం చేశారు. ఈ సమావేశానికి పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు కసుకుర్తి ఆదేన్న ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ వార్డు కమిటీల నియామకాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులకు పెద్దపీట వేస్తోందని ఆరోపించారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. జగనన్న 2.0లో కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో 15 వేలకు పైగా పార్టీ పదవులు భర్తీ చేయనున్నట్లు, అందరికి పార్టీ గుర్తింపు కార్డులు అందజేస్తామని తెలిపారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా సైనికుల్లా పని చేయాలని,కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం బత్తుల బ్రహ్మానందరెడ్డి, కసుకుర్తి ఆదేన్న మాట్లాడుతూ చంద్రబాబు చెప్పిన అబద్ధాలు ప్రజలకు బహిర్గమవుతున్నాయని, వాటి నుంచి దృష్టి మళ్లించేందుకు వైఎస్సార్‌సీపీ నయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలు, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి వంటి అంశాల్లో ప్రజలను మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వ అరాచకాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కనిగిరి నియోజకవర్గంలో తక్కువ మెజార్టీతో ఓడిపోయినప్పటికి, పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూచనల మేరకు దద్దాల నారాయణ యాదవ్ ప్రజల్లో నిత్యం తిరుగుతూ, పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ సమావేశంలో షేక్ అబ్దుల్ గఫార్, మడతల కస్తూరిరెడ్డి, ఓకే రెడ్డి, గాయం బలరామిరెడ్డి, గోపవరపు బొర్రారెడ్డి, యక్కంటి శ్రీనివాసులురెడ్డి, కటికల వెంకటరత్నం, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, సిరుప గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, చీమల బ్రహ్మారెడ్డి, మందాది కృష్ణారెడ్డి, అచ్చాల శ్రీనివాసరెడ్డి, సంగు వెంకటేశ్వరరెడ్డి, గుదే రమణయ్య చౌదరి, మల్లెల యాకోబు, శెట్టిపల్లి కొండయ్య, షేక్ కాశీంవలి, కంటు గురవయ్య, బత్తుల మాలి, బాపట్ల కొండలరావు, డబ్బుకొట్టు రవికుమార్, కొర్రపాటి ఓబులేసు, మేకల మాల్యాద్రి, పెరికల వెంకటేశ్వర్లు, పాపసాని శ్రీనివాసరెడ్డి, కనమర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, మైల కొండయ్య, లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, లక్కిరెడ్డి హనుమారెడ్డి, యాల్ల కృష్ణారెడ్డి, మూలే యోగిరెడ్డి, భూమిరెడ్డి కొండారెడ్డి, పరుచూరి రమేష్ గౌడ్, కసిరెడ్డి రామసుబ్బారెడ్డి, రాపూరి అంజయ్య, మేడం కృష్ణారెడ్డి, గుంటక రమణారెడ్డి, శ్యామల సాంబిరెడ్డి, కస్తాల బాలాజీ, సైకం ఏడుకొండలురెడ్డి, నాలి వెంకటేశ్వర్లు, రుద్రపాటి సాల్మన్ రాజ్, షేక్ షరీఫ్, వంకదారి రాజా, పాపాబత్తిన నాగేశ్వరరావు, తమ్మనేని రమణారెడ్డి, షేక్ ఖాదర్ జిలాని, చిన్నిగారి కొండలు, పైడాల మోహన్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈసుబ్‌వలిని పరామర్శించిన మంత్రి గొట్టిపాటి



**అద్దంకి , ఫిబ్రవరి 10,ప్రభాతవార్త**

మండలంలోని మణికేశ్వరం గ్రామానికి చెందిన షేక్ ఈసుబ్ వలి ఇటీవల హార్ట్ స్టంట్ చేయించుకున్న నేపథ్యంలో,రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారంవారి నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, త్వరితగతిన పూర్తిగా కోలుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

## గుండ్లకమ్మ నదిలో చేప పిల్లలను వదిలిన మంత్రి





**అద్దంకి , ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**

మత్స్యకారుల ఉపాధి, సంక్షేమం కోసం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం మణికేశ్వర సమీపంలోని గుండ్లకమ్మ నదిలో 2.5లక్షల చేప పిల్లలను వదిలారు. గతేడాది 20లక్షల చేప పిల్లలను వదిలాం అని ఈ సందర్భంగా మంత్రి ప్రకటించారు. ఈ ఏడాది కూడా సుమారు పదిలక్షల పిల్లలను గుండ్లకమ్మలో వదిలినట్లు మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వం గుండ్లకమ్మ ప్రాజెక్టును నిర్వీర్యం చేసిందని, వైసీపీ నేతలు గుండ్లకమ్మ ప్రాజెక్టుల గేట్లు విరగగొట్టి ఇసుక దోపిడీ చేశారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రాజెక్టు గేట్లు పెట్టి 2 టీఎంసీల నీరు నిల్వఉంచినట్లు, మత్స్యకారుల సంక్షేమంకోసం రాయితీతో వలలు, బోట్లు అందజేస్తున్నామని, వేటనిషిద్ధ సమయంలో కూడా మత్స్యకారులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## మంత్రి పిలుపుకు స్పందించిన భగీరథ కెమికల్స్ సంస్థ

- మంత్రికి 12 లక్షల చెక్కు అందజేసిన కంపెనీ ప్రతినిధులు



**అద్దంకి , ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**

విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపు మేరకు భగీరథ కెమికల్స్ సంస్థ విరాళం ప్రకటించింది. నియోజక వర్గంలోని 8 ప్రభుత్వ పాఠశాలల్లో మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటు కోసం రూ. 12 లక్షల చెక్కును కంపెనీ ప్రతినిధులు లింగమనేని వెంకట రామయ్య, సిహెచ్ శ్రీనివాసరావు మంగళవారం మంత్రికి అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సామాజిక బాధ్యతతో విద్యా రంగానికి సహకరించిన సంస్థను అభినందించారు. ఇప్పటికే అద్దంకి నియోజకవర్గంలో దాదాపు 7వేల మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేసిన మంత్రి,ఇప్పుడు స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మంత్రికి యుటిఎఫ్ నేతల వినతి పత్రం



**అద్దంకి ,ఫిబ్రవరి 10,ప్రభాతవార్త**

ఉద్యోగుల, ఉపాధ్యాయులు ఆర్థిక సమస్యల పరిష్కారం నిమిత్తం ఫిబ్రవరిలో జరుగనున్న బడ్జెట్ సమావేశాలలో తగిన నిధులు కేటాయించి ఉద్యోగులకు న్యాయం చేయాలనీ కోరుతూ అద్దంకి మండల యు.టి.ఎఫ్ డివిజన్ బాద్యులు మంగళవారం రాష్ట్రవిద్యుత్‌శాఖ మంత్రిగొట్టిపాటి రవికుమార్‌కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఊరి బడిని కాపాడుకుందాం పేరుతో యుటిఎఫ్ చేస్తున్న ప్రత్యేక క్యాంపెయిన్ ఆయన అభినందించారు. ప్రభుత్వ కల్పిస్తున్న సౌకర్యలను ప్రజలకు చెప్పడం ద్వారా ప్రభుత్వ స్కూల్స్‌లో విద్యార్థులు సంఖ్య పెంచాలని కోరారు. ఈ సందర్భంగా యు.టి.ఎఫ్. వారి ప్రభుత్వ బడులలో పిల్లల్ని చేర్పిద్దాంఊరి బడిని కాపాడుకుందాం పోస్టర్ ను మంత్రి గొట్టిపాటి ఆవిష్కరించారు.కార్యక్రమంలో యు.టి.ఎఫ్. ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షులు వై. వెంకట్రావు, జిల్లా కార్యదర్శి దుర్గా ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.బాబురావు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శి జి.వి. రత్నం, బి.పూర్ణచంద్రరావు,రవిచంద్ర, రామాంజనేయులు, అజయ్, యు.రాజశేఖర్, వై.ఆదినారాయణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## గ్రూపు-1 ఉద్యోగిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే



**కందుకూరు పిబ్రవరి 10,ప్రభాతవార్త**

ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో డిప్యూటీ రిజిస్ట్రార్ ఉద్యోగం సంపాదించిన గొల్లపూడి ఉదయ్‌కుమార్‌ను స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం అభినందించారు. కందుకూరు పట్టణంలోని తేదేపా కార్యాలయంలో ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈయన విజయం పలువురికి ఆదర్శమన్నారు.ఉలవపాడు మండలం వీరేపల్లిలో చిన్న కుటుంబంలో జన్మించి,కష్టపడి చదివి,ఉజ్వల భవిష్యత్ సాధించడం ప్రశంసనీయమన్నారు.ఇప్పటికే ఈయన సామర్లకోటలో అసిస్టెంట్ రైల్వేస్టేషన్ మాస్టర్‌గా విధులు నిర్వహిస్తుండడం గమనార్హం.ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకుడు లక్కంరాజు నరేష్, మోడల్ స్కూల్ చైర్మన్ ప్రభాకర్, తెదేపా నేతలు సత్యం,గురవయ్య,నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## నిడమానూరు, పోతవరం పంచాయతీలను పరిశీలించిన ఎంపీడీవో



**నాగులుప్పలపాడు,ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలను క్షేత్రస్థాయిలో అమలు జరిగే కార్యక్రమాల పరిశీలనలో భాగంగా నాగులుప్పలపాడు ఎంపీడీవో తేళ్ల రవికుమార్ మంగళవారం నాడు హెచ్.నిడమానూరు, పోతవరం గ్రామపంచాయతీలను సందర్శించారు. పంచాయతీ సిబ్బంది హాజరు, పనితీరు, రికార్డులను పరిశీలించారు. స్వర్ణ పంచాయితీ,ఇంటిపన్ను ఆదాయపు చెల్లింపులు, పారిశుధ్య కార్యక్రమాలు, ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, అక్షర ఆంధ్ర తదితర అంశాలను సమీక్షించి వాటిపై తగు సూచనలు తెలిపారు. ఫిబ్రవరి 15 నాటికీ 100 ఇంటి పన్ను వసూలు చేయాలి, రోజువారీ ప్రగతి సమీక్షించబడును. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ఫిబ్రవరి 15 నాటికీ 100 పూర్తి చేయాలి. అంతవరకు సచివాలయం సిబ్బందికి సెలవులు ఇవ్వబడవు అక్షర ఆంధ్ర అన్నీ సెంటర్స్ ప్రారంభం చేయాలి, లెర్నెర్స్, వాలంటీర్స్ హాజరు ఆన్లైన్ లో నమోదు చేయాలి. ప్రతి రోజు ఇంటి నుండి చెత్త సేకరణ కొనసాగించాలి.కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గూడ్స్ లారీ ఢీకొని మహిళ మృతి



**కొరిసపాడు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**

టీవీఎస్ మోపెడ్ పై వెళుతున్న భార్యాభర్తలను వెనుక నుంచి గూడ్స్ క్యారియర్ లారీ ఢీకొన్న సంఘటనలో భార్య మృతి చెందగా,భర్త గాయాల పాలైన సంఘటన మేదరమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. మేదరమెట్ల ఎస్సై షేక్ మొహమ్మద్ రఫీ తెలిపిన వివరాల ప్రకారం మార్టూరు మండలం కోనంకి గ్రామానికిచెందిన మెడసరి మల్లేశ్వరి, భర్త వెంకటేశ్వర్లుతో మండలంలోని తమ్మవరం గ్రామం నుంచి ఉదయం తమ స్వగ్రామానికి బయలుదేరింది. ఈ క్రమంలో మేదరమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని రష్కేఫ్ ఎదురు జాతీయ రహదారిపై వారు పయనిస్తున్న టీవీఎస్ మోపెడ్ ఎక్స్ ఎల్ ను ఉదయం 11.30గంటల ప్రాంతంలోఒంగోలు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న గూడ్స్ క్యారియర్ లారీ డ్రైవర్ అతి వేగంగా, నిరక్ష్యంగా తన వాహనాన్ని నడుపుతూ వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో మోపెడ్ పై వెనక కూర్చున్న మెడసరి మల్లేశ్వరి (42) క్రింద పడగా లారీ టైర్లు ఆమె పైనుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలపాలై ఘటనాస్థలిలో మరణించింది. ఆమె భర్తకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎస్ఐ షేక్ మొహమ్మద్ రఫీ తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యవసాయ సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలి - ఎఒ



**అద్దంకి , ఫిబ్రవరి 10,ప్రభాతవార్త**

వ్యవసాయ సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలి అని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. గోవాడ మరియు చిన్నకొత్తపల్లి గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోందికార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ ప్రతి రైతు వినియోగించుకోవాలనే ఉద్దేశ్యం తో ప్రభుత్వం డ్రోన్ యాప్ ను ప్రవేశపెట్టింది అని ప్రతి రైతు యాప్ డౌన్లోడ్ చేసుకుని యాప్ ద్వారా పురుగుమందుల పిచికారీ కొరకు డ్రోన్ ను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా ప్రతి రైతు తమ పొలాన్ని తామే ఈ పంట నమోదు చేసుకోవచ్చని , పొలంలో చీడపీడలు, నివారణ చర్యలు తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమం లో గ్రామ ఉద్యాన సహాయకురాలు శ్రీలక్ష్మి, వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు,ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు తదితరులు పాల్గొన్నారు

## అద్దంకికి రైల్వే సౌకర్యం కొరకు

### కేంద్రమంత్రికి వినతి పత్రం అందించిన ఇరువురు ఎంపిలు

- ఎంపిలకు కృతజ్ఞతలు తెలిపిన సాధన సమితి నేతలు



**అద్దంకి , ఫిబ్రవరి 10,ప్రభాతవార్త**

పిడుగురాళ్ల నుండి ఒంగోలు వయా అద్దంకి మద్దిపాడు నూతన రైల్వే లైన్ కావాలని ఓం ఎపి రైల్వే లైన్ సాధన సమితి చేస్తున్న కృషికి చక్కని ఫలితం దక్కిందని రైల్వే లైన్ సాధన సమితి కోర్ కమిటీ సభ్యులు బచ్చుల వాసు పేర్కొన్నారు. మంగళవారం నాడు దేశ రాజధాని న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాస్ రెడ్డి మరియు నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు స్వయంగా కలసి పిడుగురాళ్ల నుండి రామాయపట్నం పోర్ట్ వరకు అద్దంకి ఒంగోలు మీదుగా నూతన రైల్వే లైను కావాలని అడగడం జరిగింది.ఈ సందర్భంగా ఈ నూతన రైల్వే లైన్ గురించి ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డితో చర్చించిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అలాగే గతంలో ఓం ఏపీ రైల్వే లైన్ సాధన సమితి సభ్యులకు ఇచ్చిన మాట ప్రకారం కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి ఈ నూతన రైల్వే లైన్ విషయాన్ని తీసుకువెళ్లినందుకు ఒంగోలు పార్లమెంటుసభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి మరియు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు టీం ఓం ఏపీ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని బచ్చుల వాసు అన్నారు.

## నేడు సత్యసాయి అఖండ జ్యోతి దర్శనం



**అద్దంకి , ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**

ిభగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్యమైన అనుగ్రహ ఆశీస్సులతో సత్యసాయి సేవా సంస్థలు, ఆంధ్రప్రదేశ్ వారు, భక్తులందరికీ శ్రీ సత్య సాయి అఖండ జ్యోతి దర్శనం కలిగించడం జరుగుచున్నది. దానిలో భాగంగా శ్రీ సత్యసాయి అఖండ జ్యోతిని బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు అఖండ జ్యోతి దివ్య దర్శనము పొట్టి శ్రీరాములు విగ్రహం నుండి పుట్టపర్తి సత్యసాయిబాబా మందిరం వరకు ఈ కార్యక్రమంలో అద్దంకి పుట్టపర్తి సాయిబాబా సమితి వారు,అద్దంకి పట్టణంలోని భక్తులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## వసతి గృహాన్ని పరిశీలించిన డీఈవో



**బల్లికురవ, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త**

స్థానిక కస్తూరిబా గురుకుల విద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన బి గ్రేడ్ బాలికల వసతి గృహాన్ని మంగళవారం సాయంత్రం బాపట్ల, విద్యాశాఖ అధికారి డి .శ్రీనివాస్ పరిశీలించారు. విద్యార్థులకు వసతి గృహంలో అందుతున్న సౌకర్యాలను ఆరా తీశారు. మెనూలోని ఆహార పదార్థాలను పరిశీలించారు.విద్యార్థులకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు శ్రీనివాసరావు, రమేష్ బాబు, తదితరులు ఉన్నారు.

## అదుపు తప్పి లారీ బోల్తా



**సంతమాగులూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త**

సుబాబుల్ కర్ర లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా కొట్టిన సంఘటన స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది.వివరాలలోకి వెళితే సుబాబుల్లోడుతో వస్తున్న లారీ పుట్ట వారి పాలెం నుండి అద్దంకి వైపు వెళ్తున్న సమయంలో లారీ పల్టీ కొట్టింది.ఆ సమయంలో ఎవరు అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలం వద్దకు చేరుకొని పరిశీలించారు.ఎవరికి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

## మార్కాపురంలో 13న జాబ్ మేళా

**మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం మరియు సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డులో గల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు ఈ నెల 13వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జే. రవితేజ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ జాబ్ మేళా కార్యక్రమమునకు టాటా ఎలక్ట్రానిక్, యాక్సిస్ బ్యాంక్ హెటెరో లాబ్స్ మరియు డిబిఎస్ బ్యాంక్ మొదలగు 12 కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. కావున జిల్లాలోని 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువతి, యువకులు పాల్గొని,ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని, ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు రూ.13,500 నుంచి రూ.25,000 మధ్యలో జీతం ఇవ్వబడుతుందన్నారు. మరిన్ని వివరములకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఎస్‌కె. ఫిరోజ్ గాంధీ,7013950097, 9912438757 సెల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

